RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 85 ఆదివారం 20 ఏప్రిల్ 2025 పేజీలు : 4

### ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# మంత్రివర్గ ముసలం

## నిరసన గళం విప్పుతున్న ఆశావహులు!

## తలపట్టుకుంటున్న పార్టీ పెద్దలు!





తెలంగాణ కాంగ్రెస్ లో మంత్రివర్గ విస్తరణ ముసలం పుట్టిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా, మంత్రివర్గాన్ని విస్తరించకపోవడంపై ఎమ్మెల్యేలు ముఖ్యంగా ఆశావహులు నిరసన బాట ఎంచుకుంటున్నారు. తమకు మంత్రి పదవుల ఆశచూపి మోసం చేస్తున్నారని పార్టీ హైకమాండ్ పై మండిపడుతున్నారు. ఇప్పటివరకు పలువురు సీనియర్లు నిరసన గళం విప్పగా, తాజాగా ముదిరాజ్ సంఘం పేరిట కొంతమంది ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి అభిమానులు రాసిన లేఖ వైరల్ అవుతోంది. దీంతో కాంగ్రెస్ లో మంత్రివర్గ విస్తరణ అంశం చినికి చినికి గాలివానగా మారుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల తొలివారంలోనే రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరిస్తామని కాంగ్రెస్ హైకమాండ్ లీకులిచ్చింది. ఇప్పటికే ఈ విషయంపై అనేకసార్లు చర్చించిన కాంగ్రెస్ పార్టీ.. కాబోయే మంత్రుల ఎంపికపై ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. దీంతో విడతల వారీగా వాయిదాలు వేస్తూనే వస్తోంది. చివరి ముహూర్తమంటూ చెప్పిన ఈ నెల తొలివారం కూడా వాయిదాతో ముగిసిపోయింది. ఈ పరిస్థితుల్లో తాము జీవితంలో మంత్రులు కాలేమా? అంటూ ఆశావహులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గత ఎన్నికల సమయంలో పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవులిస్తామని కొందరికి ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా కాంగ్రెస్ హామీ ఇచ్చిన వారిలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, మల్ రెడ్డి రంగారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. రకరకాల సామాజిక, ప్రాంతీయ సమీకరణలతో వీరికి మంత్రి పదవులు ఇవ్వలేకపోతున్నామని నచ్చజెప్పేందుకు కాంగ్రెస్ విఫలయత్నమవుతోంది. దీంతో వారి నుంచి రోజురోజుకు ఒత్తిడి ఎక్కువవుతోంది. తమకు మంత్రి పదవులు ఇవ్వకపోతే తడాఖా చూపుతానంటూ ఎమ్మెల్యే మల్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి తదితరులు బహిరంగంగా వార్నింగులిస్తున్నారు. ఇక రాష్ట్రంలోని ప్రధాన సామాజికవర్గమైన ముదిరాజులకు మంత్రివర్గంలో అవకాశమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఏకైక ముదిరాజ్ నేతగా మక్తల్ శాసనసభ్యుడు వాకాటి శ్రీహరికి బెర్తు దాదాపు ఖరారు అన్నారు. అయితే విస్తరణ ఆలస్యం అవడం వల్ల ముదిరాజ్ నేత మంత్రి కాలేకపోతున్నారని ఆ సామాజిక వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా వాకాటిని మంత్రిని చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డిని దూషిస్తూ ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి కొందరు వ్యక్తులు రాసిన లేఖ ఆన్ లైన్ లో వైరల్ అవుతోంది. ఎమ్మెల్యే టికెట్ కోసం రూ.10 కోట్లు, మంత్రి పదవి కోసం రూ.100 కోట్లు ఖర్చు పెట్టామని ఆ లేఖలో పేర్కొనడం సంచలనంగా మారింది.

## ఫ్యూచర్ సిటీ కోసం రేవంత్ రెడ్డి.. తెగ కష్టపడుతున్నారుగా?



టోక్యోలో జరిగిన ఇండియా–జపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో తెలంగాణముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి పాల్గొని, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని వివరించారు. జపాన్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ, తెలంగాణలో వ్యాపార స్థాపన ద్వారా అభివృద్ధి సాధించాలని కోరారు. టోక్యోలోని అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలను ప్రశంసిస్తూ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల మానవ వనరులు, స్థిరమైన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లైఫ్ సైన్సెస్, జీసీసీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని జపాన్ సంస్థలను ఆకర్షించారు. భారత్, జపాన్ కలిసి ప్రపంచానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులను ప్రచార వీడియోల ద్వారా ప్రదర్శించి, ఈ ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ గ్లోబల్ నగరంగా ఎలా రూపొందుతుందో వివరించింది. ఈ కార్యక్రమం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి జపాన్ సంస్థలతో సహకారాన్ని పెంచే దిశగా కీలకమైన అడుగుగా నిలిచింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ వివిధ రంగాల్లో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలను, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. సింగిల్ విండో అనుమతులు, నమ్మకమైన విద్యుత్ సరఫరా, పారదర్శక విధానాలతో తెలంగాణ పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర బృందం జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, సహకార అవకాశాలను చర్చించింది. ఈ సమావేశాలు రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు, ఉద్యోగ అవకాశాల సృష్టికి దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ రోడ్‌షో ద్వారా తెలంగాణ గ్లోబల్ ఆర్థిక వేదికపై తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. జపాన్ సంస్థలతో భాగస్వామ్యం రాష్ట్రంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిని వేగవంతం చేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చేందుకు ఈ పెట్టుబడులు కీలకమవుతాయని, రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలను అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, జపాన్ మధ్య ఆర్థిక సహకారం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, తెలంగాణ గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా మరింత ముందుకు సాగుతుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



### ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ ముఖ్య అధికారులతోనూ సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. " ఈ ఏడాది యాసంగిలో రికార్డు స్థాయిలో 127.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. వానకాలం, యాసంగి కలిపి 281 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశముంది. అందుకు అనుగుణంగా కొనుగోలు కోసం అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలి" అని ఉత్తమ్ సూచించారు.

# కేంద్రంలో భారీ మార్పులు..

## పది రోజుల్లో కీలక పరిణామాలు




## మంత్రివర్గంలో పూర్తి స్థాయిలో మార్పులు - చేర్పులకు అవకాశం!

దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకోనున్నాయా? అధికార బీజేపీకి నూతన అధ్యక్షుడి నియామకంతోపాటు కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు ఉండే అవకాశాలు ఉన్నాయని రాజధాని ఢిల్లీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరో వారం పది రోజుల్లోనే పార్టీ, ప్రభుత్వంలో ప్రక్షాళన ఉండొచ్చని కమలం పెద్దలు సంకేతాలు పంపుతున్నారు. అయితే కొత్త అధ్యక్షుడు కాబోయే నేత పార్టీతోపాటు ప్రభుత్వంపైనా పట్టుసాధించేలా ఉండాలని సంఘ్ పరివార్ కోరుకుంటుందనే ప్రచారమే ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రధాని మోదీ శకం నడుస్తోంది. 2014లో ప్రధానిగా మోదీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వం, బీజేపీలో మోదీ వన్ మేన్ షో నడిచేది.. ప్రస్తుతం నడుస్తుంది కూడా.. అయితే ఈ పరిస్థితిలో మార్పు రావాలని సంఘ్ పరివార్ కోరుకుంటోందని అంటున్నారు. మోదీ మూడోసారి ప్రధాని పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా బీజేపీ బలంగా ఉండాలనే ఆలోచనతో ఉన్న సంఘ్ పరివార్ పార్టీ అధ్యక్షుడిగా బలమైన నేత ఉండాలని కోరుకుంటున్నారని అంటున్నారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన ఆర్ఎస్ఎస్ తాజా సూచనలను బీజేపీ పెద్దలు పాటించాల్సిన అనివార్య పరిస్థితులు ఉన్నాయంటున్నారు. దీంతో మరో వారం రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతోపాటు పార్టీలోనూ భారీ మార్పులు ఉంటాయంటున్నారు. అదే సమయంలో నాలుగైదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించే అవకాశం ఉందని అంటున్నారు. దేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ, మిత్రపక్షాల ప్రభుత్వాలే ఉన్నప్పటికీ గత సార్వత్రిక ఎన్నికల్లో అత్తెసరు సంఖ్యలో గెలవడం, మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని కొనసాగించాల్సి రావడాన్ని బీజేపీ పెద్దలతోపాటు ఆర్ఎస్ఎస్ అగ్ర నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఇదే సమయంలో కచ్చితంగా ఓడిపోతాయని సర్వేలు తెలిపిన మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలల్లో ఆఎస్ఎస్ ఫార్ములా వర్క్ అవుట్ అవ్వడాన్ని గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా ఈ ఫార్ములా అమలు కావాలంటే బలమైన నేత పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని ఆర్ఎస్ఎస్ సూచిస్తోందని అంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కొందరు మంత్రులను తప్పించాలని సూచనలు ఉన్నాయంటున్నారు. ప్రజలతో నేరుగా సంబంధం లేని చాలా మంది కేంద్ర మంత్రులుగా ఉన్నారని, దీనివల్ల ప్రజలను ఆకర్షించలేకపోతున్నామని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడుతోందని అంటున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా పనిచేసిన కొందరి ప్రతిభ ఆధారంగా కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవడం వల్ల రాజకీయంగా ప్రయోజనం దక్కడం లేదని ఆర్ఎస్ఎస్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ఐపీఎస్ గా పనిచేసి రాజీనామా చేసిన తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై వంటివారిని కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవాలని ఆర్ఎస్ఎస్ నుంచి సూచనలు వస్తుండటం గమనార్హం అంటున్నారు. ఇదేవిధంగా కొంతమంది గవర్నర్ల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోందని బీజేపీతోపాటు ఆర్ఎస్ఎస్ నేతలు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారని చెబుతున్నారు. తమిళనాడు గవర్నర్ రవి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో వివాదం పెట్టుకోవడం, తమిళనాడు ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడమే కాకుండా నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలతో దక్షిణాదితో పార్టీని వేరు చేసే వ్యూహాన్ని అమలు చేయడాన్ని బీజేపీ పెద్దలు సీరియస్ గా తీసుకున్నారని అంటున్నారు. ఈ రాజకీయ వ్యూహం నుంచి బయటపడాలంటే గవర్నర్ ను మార్చాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారని అంటున్నారు. అయితే ఒక్క తమిళనాడు గవర్నర్ ను మార్చితే స్టాలిన్ ప్రభుత్వానికి తలొగ్గినట్లు అవుతుందనే ఆలోచనతో దేశవ్యాప్తంగా నలుగురైదుగురు గవర్నర్లను మార్చాలనే ప్రతిపాదన పరిశీలిస్తున్నారని అంటున్నారు. దీంతో ఈ నెలాఖరు లేదా మే మొదటి వారంలో దేశ రాజకీయాల్లో భారీ మార్పులు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది.

# సంపాదకీయం

## మళ్లీ ముక్కలు కానున్న పాకిస్తాన్?

పాకిస్తాన్ మళ్లీ ముక్కలయ్యేలా ఉందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ భారత్, కాశ్మీర్ హిందువుల గురించి మత విద్వేషపూరితమైన ప్రసంగం చేశారు. సరిగ్గా అలాంటి ప్రసంగాన్నే 1971లో బంగ్లాదేశ్ (తూర్పు పాకిస్తాన్) ఏర్పడటానికి ముందు అప్పటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేశారు. పీఓకే (పాక్ ఆక్రమిత కాశ్మీర్), బలూచిస్తాన్ చేజారిపోతున్నట్లు చూసిన పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ తన సైన్యాన్ని అప్రమత్తం చేయాల్సింది పోయి మతం పేరుతో రెచ్చగొడుతున్నారు. సైనిక దుస్తుల్లో ఉన్నప్పటికీ జనరల్ మునీర్ ఒక మౌలానా వలె ప్రసంగిస్తున్నారు. పాకిస్తాన్ సైన్యం ట్యాంకుల్లో నడపడానికి చమురు లేదు, మునీర్‌కు తన సైన్యంపై నమ్మకం లేదు. ఉగ్రవాదం మార్గంలో నడుస్తూ ప్రపంచం నుండి ఒంటరిగా మారిన పాకిస్తాన్‌కు ఇప్పుడు తన మతం గుర్తుకొస్తోంది. భారతదేశంలో పెరుగుతున్న సైనిక శక్తి, పీఓకేలో త్రివర్ణ పతాకం ఎగురవేయడంతో భయపడిన పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ ఇప్పుడు ఇస్లాం పేరుతో పాకిస్తాన్ ప్రజలను ఏకం చేయడం ప్రారంభించారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ బుధవారం (ఏప్రిల్ 16, 2025) ఓవర్సీస్ పాకిస్తాన్ కన్వెన్షన్ కార్యక్రమంలో కాశ్మీర్‌కు మద్దతుగా మళ్లీ అర్థంలేని వ్యాఖ్యలు చేశారు. భారతదేశానికి వ్యతిరేకంగా తీవ్రంగా మాట్లాడారు. మునీర్ మతం పేరుతో ముస్లింలను ఏకం చేయాలని పిలుపునిచ్చారు. వాస్తవానికి పీఓకేలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం, సైన్యం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. దీని తర్వాత పాకిస్తాన్ ప్రభుత్వం కుర్చీ కదులుతోంది. జనరల్ మునీర్ మాట్లాడుతూ, జీవితంలోని ప్రతి అంశంలోనూ మనం హిందువుల నుండి భిన్నంగా ఉన్నాము. మన మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు వేరుగా ఉన్నాయి. అందుకే మన పూర్వీకులు పాకిస్తాన్‌కు పునాది వేశారు. తన భూమి తన చేతుల నుండి జారిపోతున్నట్లు చూసి మునీర్‌కు ఎంత భయం పట్టుకుందంటే, పాకిస్తాన్ ప్రజలను తమ పిల్లలకు దేశ విభజన కథను చెప్పమని పిలుపునిచ్చారు. మునీర్ తన ప్రసంగంలో బలూచిస్తాన్‌ను ప్రత్యేక దేశంగా మార్చాలనే బలూచ్ పోరాట యోధుల భావజాలం గురించి మాట్లాడుతూ.. 1500 మంది బలూచ్ పోరాట యోధుల 10 తరాలు కూడా బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ నుండి వేరు చేయలేవని అన్నారు. వాస్తవం ఏమిటంటే, రైలు హైజాకింగ్ నుండి పాకిస్తాన్ సైన్యంపై జరిగిన దాడుల వరకు బలూచిస్తాన్‌లో స్వాతంత్ర్య ఉద్యమం తీవ్రరూపం దాల్చిందని భావిస్తున్నారు. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో పాకిస్తాన్ నేడు ప్రపంచంలో అత్యధిక ఉగ్రదాడులు జరిగే రెండవ దేశం. ఉగ్రవాదం, హింస, వేర్పాటువాదంలో పాకిస్తాన్ నేడు సిరియా వంటి దేశాన్ని కూడా అధిగమించింది. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పీఓకే తిరిగి భారతదేశానికి వస్తే కాశ్మీర్ సమస్య పరిష్కారమవుతుందని చెప్పి సంచలనం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పీఓకేను భారతదేశ కిరీట మణిగా అభివర్ణించారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లేకుండా జమ్మూ కాశ్మీర్ అసంపూర్ణమని, ఎందుకంటే పీఓకే భారతదేశ కిరీట మణి అని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

# రైతు అభివృద్ధి యే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది : కలెక్టర్ గౌతం

### భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతం




శామీర్ పేట, (గరుడ వార్త) : రైతుల అభివృద్ధి యే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం పై అవగాహన సదస్సుకు కలెక్టర్ గౌతం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు లాభం కోసం ఆలోచించి భూ భారతి చట్టం రూపొందించిందని, దీంతో ఒక మంచి మార్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం ఎన్నో విధాలుగా ఆలోచించి ధరణిలోని సమస్యలను తొలగించి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. దీంతో ప్రతి ఒక్కరి భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ధరణిలోని సమస్యలతో నష్టపోయిన వారికి మేలు చేయాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో కృషి చేసి ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అనుభవజ్ఞులైన రిటైర్ ఉద్యోగులు, నిపుణులు ఎంతో మందితో చర్చించి ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది అన్నారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారలు, హక్కులు లేకుండా, ప్రతి సమస్యకు కోర్టుకు వెళ్లవలసి ఉండేదన్నారు. సమస్యలున్న రైతులందరు కోర్టుకు వెళ్లలేనందున అధిక సంఖ్యలో సమస్యలు మిగిలిపోయాయని కలెక్టరు తెలిపారు. కోర్టులకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టంలో తహాసీల్దారు స్థాయి నుండి సిసిఎల్ఎ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే వెసలుబాటు భూభారత్ చట్టంలో ఉందన్నారు. ధరణిలో భూ కొనుగొలు, అమ్మకాలే కాకుండా భూరికార్డులలో పేర్ల మార్పులకు కూడా చాలా ఇబ్బంది కలిగిందన్నారు. ధరణిలో నష్టపోయినవారు ఇప్పటికి కొంత మంది కి న్యాయం జరగలేదని, భూ భారతి చట్టం తో భవిష్యత్తులో సైతం ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా ఈ చట్టం రూపొందించ బడిందన్నారు. ధరణిలో విఆర్ఒ వ్యవస్థను తీసివేయడంతో గ్రామాలలో రైతుల చిన్న చిన్న భూసమస్యలు పెరిగి పోయాయని చెప్పారు. ప్రస్తుతం గ్రామ పరిపాలనాధికారి నియామకాలతో గ్రామ సమస్యలను తహాసీల్దారు దృష్టికి తీసుకుపోయి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా భూభారతిలో ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యతులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించి సర్వే చేసిన కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని, తద్వారా చాలా పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని కలెక్టరు తెలిపారు. ఈ భూధార్ విజయవంతమైతే భవిష్యత్తు తరాలకు ఏలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండబోవన్నారు. ఈ చట్టం తో భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇందుకుగాను అధిక సంఖ్యలో సర్వేయర్లు అవసరమని, త్వరలోనే వేల సంఖ్యలలో సర్వేయర్లను నియమించేందు ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. ఉదాహరణకు : ధరణి తో లక్ష్మాపూర్ లోనే చాలా భూసమస్యలు ఉన్నాయని, భూ భారతితో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ అవగాహన సదస్సులో నిపుణులు భూభారతి చట్టం పై మీకందరికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తారని, తర్వాత చట్టంలో ఏమి ఉన్నది అనే విషయాన్ని మీ ఊర్లో ప్రతి క్కరికి అర్థమయ్యేలా మీరు తెలియజేయాలన్నారు. అలాగే జన సమూహాలుగా ఉండే కార్యక్రమాలలోఈ చట్టం గురించి మీరు చర్చించుకోవాలని కలెక్టరు కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం తో రెవెన్యూ అధికారుల పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని చెప్పారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలున్నాయని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందన్నారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ చిక్కులు లేని హక్కుల భూరికార్డులు ఉన్నరాష్ట్రాలలోనే వాణిజ్య, వ్యాపార రంగాలలో పెట్టుబడులు ఎక్కువగా వస్తాయని చెప్పారు. దీంతో ఆ రాష్ట్రాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. 1989 ఆర్ఓ ఆర్ చట్టం లోని అంశాలు భూభారతి లోని అంశాలు కొంత వరకు సిమిలర్ గా ఉన్నాయని, అంతే కాకుండా రెవెన్యూ అధికారులకు ధరణీలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు యాదవ్, మూడుచింతలపల్లి తహాసీల్దారు నర్సింహారెడ్డి, శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ గ్రామాలకు ఏటా కన్నీరే!

గంగాధర : గోదావరి జలాలను బీడు భూములకు తరలించాలనే ఉద్దేశంతో నిర్మించిన గంగాధర, నారాయణపూర్ ఎల్లంపల్లి జలాశయాలు పూర్తికాక వేలాది ఎకరాల భూములు బీళ్లుగానే ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు దాదాపు 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ చెరువుల సామర్థ్యం పెంచకపోవడం, అసంపూర్తి కాలువలతో సగం విస్తీర్ణానికి కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

**1100 మీటర్ల మేర తవ్వితేనే ఫలితం**

గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద రెండు ప్రధాన సాగునీటి కాలువలు, వాటి కింద ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి వైపు కుడికాలువ 19 కి.మీ నిర్మించాల్సి ఉండగా 18.2 కి.మీ మేరకు కాలువ తవ్వారు. గంగాధర ప్రధాన కూడలిలో ఇంకా 1100 మీటర్ల మేరకు తవ్వితేగానీ ఎగువ గ్రామాలకు నీరందించలేని దుస్థితి నెలకొంది. రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల, వెంకంపల్లి, పోతుగంటిపల్లి గ్రామాలతోపాటు బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరందడం లేదు.



గంగాధర, నారాయణపూర్ చెరువులను ఎల్లంపల్లి నీటితో పైపులైన్ల ద్వారా నింపి ఇక్కడి నుంచి కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి జలాశయాల సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా చెరువుల్లో నీరు ఎప్పటికీ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. చెరువుల కట్టల ఎత్తు 1.45 మీటర్లు పెంచాల్సి ఉండగా, కేవలం మత్తడి ఎత్తు పెంచి వదిలేశారు. గతేడాది వానాకాలంలో చెరువులు నిండి ప్రమాద స్థాయికి చేరడంతో మత్తడిని ధ్వంసం చేసి నీటిని కిందకు వదిలారు.

కాలువలు పూర్తికాక 27,500 ఎకరాలకు నీరందడంలేదు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో 210 ఎకరాలకు 147 ఎకరాల భూసేకరణ జరగక కాలువల పనులు పూర్తవడం లేదు. రామడుగు మండలంలో లక్ష్మీపూర్, దత్తోజిపేట, షానగర్, రామడుగు, ఇతర గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. చొప్పదండి మండలం గుమ్లాపూర్, చిట్యాలపల్లి, కాట్నపల్లి, ఇతర గ్రామాల్లోనూ ఏటా సాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారు.

నారాయణపూర్ చెరువు కట్ట కింద దాదాపు 35 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని ఏడాది కిందటే అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. మంగపేట చెరువు నుంచి 800 మీటర్ల మేరకు కుడికాలువ తవ్వాల్సి ఉంది. కాగా గంగాధర ప్రధాన కూడలిలో జగిత్యాల రోడ్డు క్రాసింగు 300 మీటర్ల మేరకు భూమి లోపలి నుంచి కాలువ తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాలువ కింద మల్లాపూర్ నుంచి వేములవాడ వరకు ఉపకాలువలు తవ్వాల్సి ఉండగా భూసేకరణ సమస్య తలనొప్పిగా మారింది. ఈ చిత్రంలోని రైతు పేరు ఐతం తిరుపతి. ఈయనది రంగారావుపల్లి. వ్యవసాయ బావి ఆధారంగా మూడెకరాల్లో పంటలు సాగు చేయగా.. బావిలో నీరు అడుగంటిపోయింది. రూ.1.50 లక్షలు వెచ్చించి రెండు బోర్లు 650 అడుగుల లోతు తవ్వినా చుక్క నీరు రాలేదు. నారాయణపూర్ జలాశయ కుడికాలువ పూర్తయితే తప్ప తమకు సాగునీటి కష్టాలు తీరేలా లేవని వాపోతున్నారు.

# అవకతవకలకు తావివ్వకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో సక్రమంగా అమలు చేయాలని ఎంపిడివో మమతాబాయి పంచాయ తీ కార్యదర్శులకు సూచించారు. శనివారం శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో మమతాబాయి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఇం దిరమ్మ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకై ధరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకై ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలని చెప్పారు. ప్రభుత్వ గైడ్ లైన్స్ ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ మనిబంధనల మేరకు నిరుపేదలైన అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ వినూత్న, అధికారులు పాల్గొన్నారు. **మూడు చింతలపల్లి మండలంలో....** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ఎంపికపై అవగాహన కార్యక్రమం శనివారం మూడుచింతలపల్లి గ్రామపంచాయితీ ఆవరణలో ఎంపిడిఓ గీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో గీతారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులకు పేదలు నిరుపేదలకు, దరఖాస్తుల ఎంపిక విధానం తెలియ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ మంగతయారు, ఇందిరమ్మ హౌజింగ్ డీ ఈ బలవంత రావు, ఏ ఈ అల్లాజి, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# అసంపూర్తి నిర్మాణం.. భయం నీడన ప్రయాణం

ఇల్లంతకుంట : ఏళ్ల తరబడి ఇబ్బందులు తొలగేలా వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వంతెన వద్ద వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఇల్లంతకుంటకు నుంచి అనంతారం వెళ్లే మార్గంలో బిక్కవాగుపై గత ప్రభుత్వ హయాంలో లోలెవల్ వంతెన సానంలో హైలెవల్ వంతెన మంజూరు చేశారు. నిధులు మంజూరైన కొన్ని సంవత్సరాల తర్వాత నిర్మాణం ప్రారంభించారు. వంతెన మొదట్లో, చివరలో పనులు పూర్తి చేయక పోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారు అరకొర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేదా రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సికింద్రాబాద్, కరీంనగర్, సిరిసిల్లకు నిత్యం బస్సులు వెళుతుంటాయి. రాత్రి వేళ, కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిన దుసితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను పూర్తి చేయాలని గ్రామసులు, యువకులు గతంలో ఆందోళనలు చేపట్టారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపడితే బాగుంటుందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సానిక ప్రజాప్రతినిధులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు**

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. వంతెన నిర్మించినా రెండు వైపులా రక్షణ గోడలు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వంతెన ఎత్తుగా ఉండటంతో ఆరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిసితి ఎదురవుతోంది. పాలకులు స్పందించి ఇబ్బందులను పరిష్కరించాలి. అక్కెం నాగరాజు, అనంతారం

**ప్రమాదకరంగా మారింది** రక్షణ గోడలు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించే వీలులేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం చోటుచేసు కునే అవకాశం ఉంది. ఈ మార్గంలో ప్రైవేట్ బస్సులో విద్యారులను పాఠశాలకు తీసుకువెళతా. ఈ ప్రాంతంలో ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికర పరిసితి ఎదురవుతోంది. పండుగ వేణు, జంగంరెడ్డిపల్లె

# అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసైన్డ్ దారులకే కేటాయించాలి..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసైన్డ్ దారులకే కేటాయించాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల హక్కులకై తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బింగి రాములు అధ్యక్షతన శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో మహా ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జస్టిస్ ఈశ్వరయ్య, బిజెపి సీనియర్ నాయకులు సాంబశివరావు, జేబీ రాజు హాజరై మాట్లాడారు.

రాష్ట్రంలో 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్లో రిజిస్టర్ కానీ అసైన్డ్ భూములను వెంటనే ఆన్లైన్ చేయాలని కోరారు. గతంలో ఇందిరాగాంధీ ఇచ్చిన ఈ ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమై ఎస్సీ ఎస్టీ బీసీ పేదలు మరింత భూమిలేని వారు అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి వీరికి యాజమాన్య హక్కులు కల్పించి వారి బతుకులు బాగు చేయాలని కోరారు. అలానే జిహెచ్ఎంసి పరిధిలోని మురికివాడలో నివసిస్తున్న పేదల ఇండ్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, సుదర్శన్ బాబు, రుద్రారం శంకర్, గంట మల్లేష్, నర్సింగరావు, నాను, కుమార్, జగన్, నర్సింలు, విజయబాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులతో.. బాధలే..!

యాదగిరిగుట్ట : రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగే కార్యాలయాల్లో యాదగిరిగుట్ట ఒకటి. ఎంత గడ్డ కాలమైనా రోజుకు 50 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతూ ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉంది. కానీ కార్యాలయానికి నాలుగు నెలలకు పైగా పూర్తిస్థాయి అధికారిని భర్తీ చేయకపోవడం, ఇన్‌ఛార్జులతో నెట్టుకురావడం విస్మయానికి గురిచేస్తోంది. బాధ్యులతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు వ్యక్తిగతంగా దీర్ఘకాలిక సెలవులలో వెళ్లడంతో తుర్కపల్లి తహసీల్దారు దేశ్య ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు.

రెండు మండలాల బాధ్యతలకు తోడు యాదగిరిగుట్ట దేవస్థానానికి వచ్చే ప్రముఖుల ప్రొటోకాల్ విధుల నేపథ్యంలో మరింత అదనపు భారం పడింది. సాధారణమైన ధరణి సేవలు, రిజిస్ట్రేషన్లు, కుల, ఆదాయం, జనన, మరణ ధ్రువపత్రాలు, వినతుల స్వీకరణ, నష్టపరిహార కల్పనలు, ప్రజాపాలన సర్వేలు, రైతుబంధు, భూసర్వేలో వంటి విషయాల్లో పూర్తిస్థాయి సేవలు అందక అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రెండు సార్లు కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు అర్జీలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరగా పరిష్కారం చేయాలని సూచించిన విషయం తెలిసిందే. కేవలం యాదగిరిగుట్టనే కాకుండా పోచంపల్లి, గుండాల, మోత్కురుతో పాటు మొత్తం ఏడు మండలాల్లో తహసీల్దారు పోస్టులు ఖాళీగా ఉండటం




గమనార్హం.ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం విడ్డూరం. దీనిపై ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఎస్ఆర్ రవిని వివరణ కోరగా త్వరలో నియామకం జరుగుతుందని తెలిపారు.

ఆలేరు నియోజకవర్గంలో ఒకే ఒక్క యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏడాది కాలంలోగా సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు. ఆలేరు మండలం, కొలనపాక గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 472, 473 లో 7.24 ఎకరాల భూమికి ఎలాంటి అనుమతులు లేనప్పటికీ డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో 154 ప్లాట్ల దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేయడంపై ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న గోపి జనవరి 8న సస్పెండ్ అయ్యారు. ఈ ఘటన ఇన్‌ఛార్జిల పాలనలో జరిగే అవకతవకలకు అద్దం పట్టింది.

# జీజీహెచ్ మరమ్మతులకు కసరత్తు

నిజామాబాద్: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదుపాయాల కల్పనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమీక్షలో చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల అభివృద్ధికి రూ.85 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన విషయం తెలిసిందే. 750 పడకలతో రోగులకు సేవలందిస్తున్న జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి కొన్ని నిధులు వెచ్చించనున్నారు. ఆసుపత్రిలో రెండు లిఫ్టుల ఏర్పాటు, మురుగునీటి వ్యవస్థకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం తదితర పనులు చేపట్టే అవకాశం ఉందంటున్నారు. దీనిపై చర్చించేందుకు వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) నరేందర్ కుమార్ గురువారం జిల్లాకు వస్తున్నట్లు సమాచారం. డిసెంబరులో ఆదేశించిన మంత్రి: వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డిసెంబరులో జీజీహెచ్‌ను



సందర్శించారు. డ్రైనేజీ లీకేజీలు, భవనం గోడలపై మురుగు పారటం చూశారు. కిటికీల అద్దాలు పగిపోయి, గోడలపై మొక్కలు పెరగడం చూసిన అప్పట్లోనే మరమ్మతులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచనలతో తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఇందుకు సంబంధించి టీఎస్ఎంఎస్ఐడీసీ నుంచి అనుమతులు లభించాక పనులు చేపట్టాల్సి ఉంది. కానీ, నాలుగు నెలలుగా ఉన్నత స్థాయికి పంపిన ప్రతిపాదనల అంశంపై పురోగతి లేదు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన సమీక్షలో మరోమారు మంత్రి దృష్టికి ఈ విషయాలు వెళ్లాయి. ఈ దఫా మంజూరు చేస్తున్న నిధులతో పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఆసుపత్రిలో శస్త్రచికిత్సల విభాగంలో ఫ్లోరింగ్, ఇతర పనులు చేపట్టే అవకాశం ఉందంటున్నారు.

ఇతర విషయాలపైనా..: డీఎంఈ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో అధికారులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. కలెక్టర్ సమక్షంలో ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష ఉండే వీలుంది. మాతాశిశు సంరక్షణ కేంద్రం భవనంలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ యూనిట్‌లో మిగిలిన పనులపైనా చర్చించనున్నారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్సల తీరు, వివిధ విభాగాల్లో అందుతున్న వైద్య సదుపాయాలు, హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్న రోగుల గురించి చర్చించే అవకాశం ఉందని చెబుతున్నారు.

# భూ సమస్యల భారం తీర్చేనా?

కామారెడ్డి, : కొత్తరెవెన్యూ చట్టాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం పెండింగ్ భూ సమస్యలతో పాటు పార్ట్-బీ సమస్యలను పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రయోగాత్మకంగా మొదటగా లింగంపేట మండలంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. జిల్లావ్యాప్తంగా కొత్తచట్టంతో రైతులకు ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకూ సన్నాహాలు చేస్తోంది.

రైతులకు హక్కు పత్రాల్లేవ్‌లింగంపేట పరిధిలోని పలు గ్రామాల్లో భిన్నమైన భూ సమస్యలు ఉన్నాయి. షట్‌పల్లి సంగారెడ్డి, పోతాయిపల్లి, ముంబోజీపేట, కొండాపూర్, భవానీపేట్, మోతె, లింగంపల్లి(కుర్దు) గ్రామాల్లో మెజారిటీ భూములు పార్ట్-బీలో నమోదైన నేపథ్యంలో పలువురు రైతులకు హక్కుపత్రాలు లభించని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సర్వేనంబర్లు లేని భూములు (భర్కరార్) ఉన్నాయి. వీటితో పాటు పట్టాభూములు సీలింగ్, అటవీ ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయి. దరఖాస్తులు.. నోటీసులులింగంపేట మండలంలో చేపట్టే సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణతో పాటు నోటీసుల జారీకి ప్రత్యేకంగా బృందాలను నియమించారు. ఉదాహరణకు ఒక రైతు తనకు పట్టాదారు పాసుపుస్తకంలో తక్కువ విస్తీర్ణం నమోదైందని, తన సమీపంలోని మరో రైతుకు చెందిన పాసుపుస్తకంలో ఎక్కువ ఉన్నట్లు ఫిర్యాదు చేశాడు.

# పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకులు సిద్ధం



హైదరాబాద్: ఉన్నత విద్య పూర్తయ్యాక పరిశోధనలపై ఆసక్తికలిగిన విద్యార్థులకు పర్యవేక్షకుల కొరత నేపథ్యంలో వారికి సూపర్‌వైజర్లను అందించేందుకు జేఎన్‌టీయూ అధికారులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీల ఆచార్యులే పర్యవేక్షకులుగా ఉండాలన్న నిబంధన మార్చి.. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న ఐఐటీ, సెంట్రల్ వర్సిటీల్లో పీహెచ్‌డీ పూర్తిచేసినవారిని ఎంపిక చేయనున్నారు.

నాణ్యమైన పరిశోధనల సంఖ్యను పెంచేందుకు ఏటా రెండుసార్లు ప్రవేశాల నోటిఫికేషన్ జారీకి నిర్ణయించారు. పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించిన అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు పీహెచ్‌డీ సీట్లు కేటాయించనున్నారు. ఈ నిర్ణయం అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనల సంఖ్య పెంచుతుందని జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. దీంతోపాటు మూడేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేసినవారు జేఎన్‌టీయూ, అనుబంధ కళాశాలలతోపాటు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించేందుకు అర్హత సాధిస్తారని వివరించారు.

**కేంద్రాల్లో సదుపాయాలపై పర్యవేక్షణ**

జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో పీహెచ్‌డీ విద్యార్థుల కోసం పరిశోధన కేంద్రాలు ఏర్పాటుచేయాలన్న షరతును జేఎన్‌టీయూ అధికారులు విధించారు. విశ్వవిద్యాలయ సలహా కమిటీ వీటిని పర్యవేక్షించనుంది. పరిశోధక విద్యార్థులకు అవసరమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు అక్కడ ఉండనున్నాయి.

వీటిల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు, సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా సౌకర్యాలుండాలి. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు లభించేలా పరిశోధన ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందించాలి.

ఇకపై పీహెచ్‌డీ ప్రవేశాలకు అనుబంధ కళాశాలలు నోటిఫికేషన్ జారీ చేసుకున్నా.. దరఖాస్తులన్నీ జేఎన్‌టీయూకు పంపి విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ అనుమతి పొందాలి. ఒక పరిశోధక విద్యార్థికి ఒకే పర్యవేక్షకులు ఉండాలన్న నిబంధనను పాటించాలి. పర్యవేక్షకులు పరిశోధనకు సంబంధించి పురోగతిని యూనివర్సిటీ అధికారులకు ఎప్పటికప్పుడు వివరించాలి. ఏదైనా తేడా వస్తే పర్యవేక్షకుల గుర్తింపును వర్సిటీ వెనక్కి తీసుకుంటుంది.

మనకు ఉపయోగపడేవి రావాలనే..

ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూవిశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న పరిశోధనలు మనకు ఉపయోగపడాలన్న లక్ష్యంతో పీహెచ్‌డీ ప్రవేశాలను ఏటా రెండుసార్లు నిర్వహిస్తున్నాం. ఏఐ, వ్యవసాయం, వైద్యం, బయోటెక్నాలజీ, ఇంజినీరింగ్ టెక్నాలజీలో పరిశోధలకు విస్తృత అవకాశాలున్నాయన్న అంచనాతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక అవసరాలే లక్ష్యంగా ఇంజినీరింగ్‌లో అనూహ్య మార్పులు వస్తున్నాయి. బహుళజాతి సంస్థలు, విదేశీ సంస్థలు అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

# ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందడుగు




సింగరేణి : బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో ఈ ఆర్థిక సంవత్సరం ఒక అడుగు ముందుకు పడింది. ఒడిశాలోని అంగూల్ జిల్లా నైనీ బ్లాకులో నుంచి ఉత్పత్తి ప్రారంభించనున్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో నైనీ ఇక నుంచి చేయూతనివ్వనుంది. నైనీ బొగ్గుబ్లాకు ద్వారా భవిష్యత్తులో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కానుంది. ఈ ఏడాది 4 మిలియన్ టన్నుల బొగ్గును అందించనుంది. తొమ్మిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నైనీ బొగ్గుబ్లాకును సింగరేణికి కేటాయించింది. అప్పటినుంచి అనేక రకాల అనుమతులతో పాటు అటవీ భూముల సేకరణకు సమయం పట్టింది. పర్యావరణ అనుమతుల కోసం కూడా కొన్నేళ్లు వేచి చూడాల్సి వచ్చింది. ఇటీవల సింగరేణి అటవీ భూమికి బదులు మరోచోట ప్రత్యామ్నాయంగా ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి భూమి కేటాయించింది. దీంతో అన్ని ప్రక్రియలు పూర్తి కావటంతో బుధవారం బొగ్గు తవ్వకాలకు ముందు చేపట్టే ఓబీ పనులు ప్రారంభించారు.

**తగ్గనున్న ఉత్పత్తి వ్యయం**

సింగరేణికి నైనీ బొగ్గుబ్లాకు లాభదాయకం. బొగ్గు పొరలు పైపైనే ఉండటంతో ఉత్పత్తికి ఖర్చు తక్కువయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణ ప్రాంతంలోని ఉపరితల గనుల్లో ఒక టన్ను బొగ్గు వెలికి తీయాలంటే 12 టన్నుల మట్టిని తొలగించాలి. దీనివల్ల బొగ్గు ఉత్పత్తి కంటే మట్టి తొలగించేందుకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. కాగా నైనీ బొగ్గుబ్లాకులో కేవలం రెండు టన్నుల మట్టిని తొలగిస్తే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. దీంతో ఉత్పత్తి వ్యయం తగ్గి లాభాలు ఎక్కువగా సాధించే అవకాశం ఏర్పడుతోంది. సింగరేణి పరిధిలోని తెలంగాణలోని ఒక్కో ఉపరితల గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.950 నుంచి రూ.1500 వరకు వ్యయం చేస్తున్నారు. నైనీ బొగ్గు బ్లాకులో మాత్రం కేవలం రూ.500 వరకు మాత్రమే ఖర్చు అయ్యే అవకాశం ఉంది.

**జీవితకాలం మూడున్నర దశబ్దాలు**

నైనీ బొగ్గుబ్లాకు జీవిత కాలం మూడున్నర దశాబ్దాల వరకు ఉంటుంది. 340 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్న ఈ గనిలో ఏటా 10 మిలియన్ టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉంది. బొగ్గు కూడా మేలు రకం కావటంతో ఎక్కువ ధరకు విక్రయించవచ్చు. జీ-10 రకం కావటంతో నాణ్యత పరంగా వినియోగదారుల నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. రవాణా చేసేందుకు రైలు మార్గం కూడా ఏర్పాటు చేసుకున్న సింగరేణికి నైనీ గని సంస్థ భవిష్యత్తుకు అండగా నిలవనుంది.

# గతానికి భిన్నంగా.. ఉపయుక్తంగా!




కొత్తగూడెం : 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, సమరూప దుస్తులు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ మరోసారి ముందస్తుగా కసరత్తు ప్రారంభించింది. ఇలాంటి విధానాన్ని అవలంబించటంతోనే ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులు ఎక్కడా ఇబ్బందులకు గురికాలేదని, ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యాసంవత్సరానికి అడుగులు వేయాలని నిర్ణయించింది. 2024-25 విద్యాసంవత్సరం ముగింపు దశలోనే 2025-26కు సంబంధించి సమరూప వస్త్రం, పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రాలకు చేరుకుంటున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజు తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పుస్తకాలు, సమరూప దుస్తులు అందించాలని అధికారులు యోచిస్తున్నారు.

**సర్కారు బడులపై నమ్మకం కలిగేలా..**

ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గతంలో బాలబాలికలకు పాఠ్యపుస్తకాలు అరకొరగా అందేవి. విద్యార్థులు పాత పుస్తకాలతో కుస్తీలు పడేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ప్రస్తుత విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య ఆధారంగా 2025-26కు సంబంధించిన పుస్తకాలను అధికారులు తెప్పిస్తున్నారు. వీటిని జిల్లా కేంద్రాల్లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. సమరూప దుస్తుల కోసం కావాల్సిన వస్త్రాన్ని మండలాలకు చేరవేశారు. కుట్టు పనుల కోసం ప్రభుత్వం గుర్తించిన స్వయం సహాయ సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు వస్త్రాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు. జతకు కుట్టు కూలి ధర రూ.75 నిర్ణయించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున సమరూప దుస్తులు అందించనున్నారు.

రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రాలకు చేరుకుంటున్నాయి. సమరూప దుస్తులు కుట్టేందుకు కావాల్సిన వస్త్రాన్ని పంపిణీ చేశాం. జూన్‌లో పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, సమరూప దుస్తులు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు ముందస్తు కసరత్తు మొదలుపెట్టాం. - సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

# ఈసారైనా మారేనా తీరు ?

కామారెడ్డి : ఆర్థిక సంవత్సరం ముగిసింది. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నగర, పురపాలికల్లో 5495 వ్యాపార అనుమతులు పునరుద్ధరణకు నోచుకున్నాయి. క్షేత్రస్థాయిలో యంత్రాంగం పర్యవేక్షణ లేక యజమానులు తక్కువ శాతం అనుమతి పత్రాలు పొందారు. బ్యాంకు రుణాల ఆవశ్యకత ఉన్నవారు మాత్రమే అనుమతుల నిమిత్తం నగర, పురపాలక కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. మిగతా వారు దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం(2025-26) ప్రారంభమై 15 రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క లైసెన్స్ జారీ చేయకపోవడం గమనార్హం.

ఆదాయానికి గండినగర, పురపాలికల ఆదాయానికి ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఏటా రూ.కోటి మేర సమకూరుతోంది. వాస్తవానికి ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 23,100 దుకాణాలు ఉంటాయని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. ప్రతి దుకాణానికి స్థాయికి అనుగుణంగా రూ.2000 నుంచి రూ.5000 వరకు రుసుం కట్టాల్సి ఉంటుంది. దీనికి తోడు హరిత పన్ను అదనపు భారమవుతోంది. దీంతో అనేక మంది వ్యాపారులు అనుమతులకు విముఖత చూపుతున్నారు.ప్రత్యేక డ్రైవ్ పెడితేనేబల్దియాల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. సమకూరుతున్న ఆదాయం ఎప్పటికప్పుడు కార్మికుల వేతనాలకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏప్రిల్, మే నెలలో పురపాలక రెవెన్యూ సిబ్బంది, బిల్‌కలెక్టర్లను క్షేత్రస్థాయిలో రంగంలోకి దింపి తక్షణ అనుమతులు జారీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తే ఆదాయం రాబట్టే అవకాశాలున్నాయి. ఈ విషయమై కామారెడ్డి పురపాలక కమిషనర్ రాజేందర్‌రెడ్డి స్పందిస్తూ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. వ్యాపారులు పురపాలక యంత్రాంగానికి సహకరించాలన్నారు.

# జాగ్రత్తలతోనే.. ధరహాసం

ఆలేరు: యాదాద్రి భువనగిరి జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 2,75,318 ఎకరాల్లో వరి సాగైంది. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నులను 372 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దిగుబడిగా వచ్చిన ధాన్యం నాణ్యతగా ఉండాలన్నా, గిట్టుబాటు ధర దక్కాలన్నా వరికోతల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చే వరకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అసవరం ఉంది. ఈ విషయమై ఆలేరు వ్యవసాయ సహాయ సంచాలకులు డి.పద్మావతి రైతులకు పలు సూచనలు చేశారు.

వరిచేను పూర్తిగా ఎండిన తర్వాత కోస్తే గింజలు పొలంలో రాలే ప్రమాదం ఉంటుంది. నేల తడిగా ఉన్నప్పుడు వరికోత మిషన్‌తో



కోస్తే భూమి పైపొర దెబ్బతింటుంది. నేల ఆరిన తర్వాత మామూలు యంత్రాలతో కోయిస్తే భూమి సమతలంగా ఉండటంతో పాటు పెట్టుబడి కూడా తగ్గుతుంది.కోసిన వెంటనే నూర్పిడి చేస్తే తేమ అధికంగా ఉంటుంది. గింజకూడా పచ్చిగా ఉంటుంది. నూర్పిడి వద్ద దుమ్ము, ధూళి పోయే విధంగా ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలి. ముందస్తుగా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలి. అకస్మాత్తుగా వర్షం పడినా ధాన్యం తడవకుండా కాపాడుకోవచ్చు. నూర్పిడి అనంతరం రెండు రోజుల పాటు ఆరబోయాలి. దీన్ని రెండు, మూడు సార్లు తిరగదోసి ఆరబెట్టాలి. తేమశాతం తగ్గుతుంది.

ఇరవై శాతం కర్రపచ్చిగా ఉన్నపుడే కోతను ప్రారంభించాలి. మరీ పచ్చిగా ఉన్నప్పుడు కోస్తే నూక ఎక్కువవుతుంది. వరికోత అనంతరం ధాన్యాన్ని జాగ్రత్తగా నూర్పిడి చేయాలి. కోసిన వరిని నాలుగు రోజుల తర్వాతనే నూర్పిడి చేయాలి.

తేమను పీల్చుకునే టార్పాలిన్లపై ధాన్యాన్ని ఆరబోయడం శ్రేయస్కరం కాదు. ధాన్యానికి మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. ధాన్యం కింది భాగాన తేమను గ్రహించని కవర్లు మాత్రమే వినియోగించాలి.

# పల్లెల్లో పాగా.. దళారుల దగా

కామారెడ్డి,: జిల్లాలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్లు లేకపోవడంతో పల్లెల్లో దళారులు పాగా వేసి అపరాలతో పాటు మొక్కజొన్నలు, పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. తూకంలో మోసాలకు పాల్పడడంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలవుతున్నారు. మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సిన సెస్సును ఎగవేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారు. జీరో దందాలకు అలవాటు పడిన దళారులు ఏకంగా కార్యాలయాలను తెరిచి కొనుగోళ్లు చేస్తున్న తీరుపై కథనం.

**యార్డులు అలంకారప్రాయం**

జిల్లాలో పది మార్కెట్‌యార్డులు, రెండు సబ్‌యార్డులున్నాయి. వీటిలో క్రయవిక్రయాలు సాగడం లేదు. మద్నూర్ మార్కెట్ యార్డుల్లో కొన్నేళ్లుగా పత్తికి బీట్(బిడ్డింగ్) నిర్వహించేవారు. ప్రస్తుత సంవత్సరం మార్కెట్ అధికారులు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులతో కుమ్మక్కై బీట్(బిడ్డింగ్)ను నిలిపివేశారు. ఇక మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగే కేంద్రాల్లో సగం ఉత్పత్తులనే కొనుగోలు చేస్తున్నారు. శనగలు, జొన్నల సేకరణలో నిబంధనలు విధిస్తున్నారు.

**అనుమతులు లేకుండానే కార్యాలయాలు**

పల్లెల్లో పాగా వేసిన దళారులు అన్నదాతలను మచ్చిక చేసుకుని వారి పేర్లమీదనే ఇతర ప్రాంతాలకు తరలిస్తూ మార్కెట్ పన్ను ఎగ్గొడుతున్నారు. తనిఖీ కేంద్రాలున్నా.. జీరోదందాను అడ్డుకోలేకపోతున్నాయనే విమర్శలున్నాయి. ప్రస్తుత సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 60 వేల ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు.



ఇప్పటికే నూర్పిళ్లు పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే అవకాశాలు లేక కర్షకులు దళారులకే అమ్ముకుంటున్నారు. వారం రోజుల కిందట గాంధారి మండలంలో ఓ దళారి తూకంలో మోసాలకు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించిన అన్నదాతలు ఆందోళనకు దిగారు. పెద్దమనుషులు జోక్యం చేసుకుని దళారి నుంచి పరిహారం ఇప్పించారు. బీబీపేట మండలంలో పత్తి కొనుగోళ్ల సందర్భంగా దళారుల మోసాలపై రైతులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రాల్లో దళారులు ఎటువంటి లైసెన్స్‌లు లేకుండానే ఏకంగా కార్యాలయాలు తెరిచి జీరో దందా చేస్తున్న పరిస్థితులున్నాయి.

**బీట్‌లు ప్రారంభిస్తేనే..**

రైతులకు కనీస మద్దతు ధర లభించేలా కొనుగోళ్లు నిర్వహించేందుకు మార్కెటింగ్ శాఖ ఎటువంటి కార్యాచరణ రూపొందించకపోవడంపై రైతు సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు మార్కెట్‌కమిటీలు ధాన్యంతో పాటు అపరాలు, ఇతర ఉత్పత్తులు కొనుగోళ్లు చేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో మాత్రం మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా మారడంతో ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అరిగోస పడుతున్నారు. ఇప్పటికైనా మార్కెట్‌యార్డుల్లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, యార్డుల పాలకవర్గాలు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

# ఇంతి సైతం.. ఇంటి కోసం..!

భువనగిరి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేముసైతం అని నిరూపించుకుంటున్నారు మహిళా కూలీలు. వీరికి అధికారుల ప్రోత్సాహం కూడా తోడైంది. జిల్లాలోని ఆయా మండలాల్లో చేపట్టిన భూ అభివృద్ధి పనులు, హరితహారం, మట్టి రహదారుల నిర్మాణం, చెరువుల పూడికతీత, ఫిష్‌పాండ్, మొక్కల పెంపకం, ఫీడర్ ఛానల్స్, ఫాంపండ్ తదితర పనుల్లో భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండటం, స్థానికంగానే పనులు కల్పిస్తుండటంతో అతివలు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధిహామీ పథకంలో పురుషులతో పోలిస్తే మహిళా కూలీలే రెట్టింపుగా పనులు చేస్తూ శ్రామిక రంగంలో



ముందంజలో ఉన్నారంటే అతిశయోక్తికాదు.

**మహిళలకు వరంగా..**

గ్రామీణులు వలస వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మొదట పురుషులే పనులకు వెళ్లేవారు. క్రమేణా మహిళలూ 'ఉపాధిహామీ' పనులు చేయడం ప్రారంభించారు. పొదుపు కోసం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సభ్యులు గ్రూపులుగా చేరిన అనంతరం ఉపాధి పనులు చురుగ్గా చేస్తున్నారు. ఒకదశలో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి గంపగుత్తాగా వరినాట్లు ఇతర పనులు చేస్తున్న సంఘటనలూ ఉన్నాయి. ప్రతి ఏడాదిలో వందరోజుల పాటు ఉపాధి పొందుతున్న మహిళా కూలీలు ప్రభుత్వం చెల్లించే సొమ్మును సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉపాధిహామీ పథకం కింద అందుతున్న కూలీ డబ్బుతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయని పలువురు మహిళా కూలీలు అంటున్నారు.

# విద్యుత్తు గోదాముల్లో నో స్టాక్..!

మిర్యాలగూడ : అద్దంకి బైపాస్ వెంబడి బహుళ అంతస్తు నిర్మిస్తున్న యజమాని నూతన విద్యుత్తు నియంత్రిక కోసం మూడు నెలల క్రితం డీడీ చెల్లించారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలోని గోదాములో విద్యుత్తు సామగ్రి కొరతతో నియంత్రిక అమర్చలేదు. దీంతో యాబై నివాసాల వారు ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు అమర్చుకోవాలని రాయితీపై ఇస్తుండగా.. ఈ ప్లాంట్లకు త్రీఫేజ్ లైన్ అవసరం. కాగా నూతనంగా ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు తీగలు కూడా స్టోర్‌లో అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని విద్యుత్తు స్టోర్లలో తీవ్ర సామగ్రి కొరత నెలకొంది. నూతనంగా ఏర్పాటు చేస్తున్న కాలనీల్లో విద్యుత్తు మీటరు అమర్చేందుకు సామగ్రి అందించలేని పరిస్థితి దక్షిణ డిస్కం సంస్థలో ఉంది. వినియోగదారులు, అధికారులు, గుత్తేదార్లు, పరిశ్రమల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలకు విద్యుత్తు నియంత్రికలు అవసరం అయితే ఇంజినీర్లు పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తే, పరిశ్రమల వారు విద్యుత్తు శాఖకు డీడీలు



చెల్లిస్తారు. గతేడాది డీడీ చెల్లించిన పది రోజుల్లోపు మెటీరియల్ గుత్తేదార్లకు అందించే వారు ఈ ఏడాది మూడు నెలలు దాటుతున్నా సామగ్రి అందించలేని పరిస్థితి ఏర్పడింది.

**జిల్లాలో పరిస్థితి:**

జిల్లాలోని మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలో 16 మంది ఏడీఈలు, 36 మంది ఏఈలు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో అవసరమైన పనుల కోసం వందల సంఖ్యలో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కనీసం సామగ్రి అందించలేని పరిస్థితి నెలకొంది. వేసవిలో ఓవర్ లోడ్ కారణంగా తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతుండగా.. అప్పటికప్పుడు అధికారులు ఉన్న సామగ్రితో తూతూ మంత్రంగా మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. రానున్న నెలరోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సామగ్రి పంపిణీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్తు ఎస్ఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. సామగ్రి కొరత ఉన్నమాట వాస్తవమేనని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అత్యవసర పనులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# నోటరీతో బురిడీ!

హైదరాబాద్: జవహర్‌నగర్ భూముల్లో మరోసారి ఆక్రమణలు ఊపందుకున్నాయి. తాజాగా ఆక్రమణలను హెచ్ఎండీఏ అధికారులు తొలగించారు. కంచెను సైతం తొలగించి ఆక్రమణలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సెక్యూరిటీ ప్రమేయంపై అనుమానాలు రావడంతో.. వారిని మరోచోటుకి మార్చారు. తక్కువ ధరకే 80, 100 గజాల స్థలాలు విక్రయిస్తామని పేదలు, మధ్యతరగతి వాళ్లకు అక్రమార్కులు ఆశ చూపుతున్నారు. ప్రాంతాన్నిబట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. తొలుత భూమిని చదును చేసి షెడ్లు వేసి తప్పుడు ఇంటి నంబర్లను రాస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి ఇంటి నంబరు వచ్చిందని నమ్మించి నోటరీ చేసి విక్రయిస్తున్నారు. అధికారులు కూలగొట్టే సమయంలో కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటున్నారు. అలా 300 ఎకరాల్లో పక్కా ఇళ్లు వెలిశాయి. మరో 500-600 ఎకరాల్లో కోర్టు కేసులు నడుస్తున్నాయి. భూముల రక్షణకు హెచ్ఎండీఏ ప్రణాళిక వేసింది. కోర్టు కేసుల్లేని 12, 107 సర్వే నంబర్లలో 750 ఎకరాలకు ఇనుప కంచెకు రూ.7 కోట్లు వరకు వెచ్చించినా ఫలితం లేదు.

# రోజుకో రీతిగా.. బాలికలకు భరోసా..!



కొత్తగూడెం : సామాజికంగా వెనుకబడిన, ప్రతికూల నేపథ్యాల నుంచి వచ్చిన బాలికలకు మెరుగైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కేజీబీవీలను బలోపేతం చేయనుంది. ప్రస్తుతం ఈ విద్యాలయాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం (ఈనెల 17)తో పరీక్షలు ముగియనున్నాయి. ఈనెల 24 నుంచి విద్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈనేపథ్యంలో గురువారం నుంచి ఈనెల 23 వరకు విద్యార్థినులకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. కార్యక్రమాల అమలుకు సంబంధిత ఉపాధ్యాయులు.. విద్యార్థినుల కోసం ప్రత్యేక సమయం కేటాయించనున్నారు. ఈమేరకు ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు దిశానిర్దేశం చేశారు.

**వారం పాటు కొనసాగింపు**

తొలిరోజు వారం రోజుల ప్రణాళికపై సమావేశం నిర్వహిస్తారు. రెండోరోజు విద్యార్థులకు నచ్చిన, ఇష్టమైన కథలు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాయటం, చదవటం (స్టోరీ రైటింగ్, లిరిక్ రైటింగ్) వంటివి చేయిస్తారు. మూడోరోజు విద్యార్థులు తమను తాము పరిచయం చేసుకోవటంతో పాటు తల్లిదండ్రులను పరిచయం చేయటం (స్పోకెన్ ఇంగ్లిష్, పబ్లిక్ స్పీకింగ్) వంటి కార్యక్రమాలు చేపడతారు. నాలుగోరోజు విద్యార్థులు తమ ఆకాంక్షలను తల్లిదండ్రులకు చదివి వినిపించి.. అమ్మానాన్నల ఆకాంక్షల (డ్రీమ్ కార్నర్/కెరీర్)ను తెలుసుకుంటారు. కేజీబీవీల్లో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి విజయగాథలు, ఆత్మగౌరవ కార్యకలాపాల గురించి ఐదోరోజు ఉపాధ్యాయులు వివరిస్తారు. ఆరో రోజు జీవిత నైపుణ్యాల (లైఫ్ స్కిల్స్)పై అవగాహన కల్పిస్తారు. సురక్షితమైన బాధ్యతాయుతమైన ప్రవర్తన, బాల్యవివాహాలపై స్కిట్ రూపంలో అవగాహన కల్పిస్తారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తారు. చివరి రోజు తల్లితండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థినుల స్థితిగతులు వివరిస్తారు.

అడ్డంకులను అధిగమించి విద్యార్థినులు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. రానున్న విద్యాసంవత్సరంలో ప్రవేశాలు భారీగా పెరగటానికి ఇవి దోహదపడతాయి. కేజీబీవీలు బాలికలకు భరోసా కల్పిస్తాయనే విశ్వాసాన్ని పెంపొందిస్తాం.

తులసి, జీసీడీఓ, ఖమ్మం

కేజీబీవీలు

ఖమ్మం 14

భద్రాద్రి 14

విద్యార్థినులు (6-9వ తరగతి)

ఖమ్మం 3,000

భద్రాద్రి 2,200

# కల్తీ 'టీ'తో చేటు.. క్యాన్సర్ 'కాటు'



హైదరాబాద్ : తిండి మానేస్తారేమోగానీ.. 'టీ' తాగకుండా రోజు గడవని వారు హైదరాబాద్‌లో అడుగడుగునా కనిపిస్తారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్ర పోయే వరకు తేనీటిని తాగుతుంటారు. చాయ్ ప్రియులారా.. కాస్త జాగ్రత్త పడాలంటూ జీహెచ్ఎంసీ ఇటీవల చేపట్టిన పరీక్షలు స్పష్టం చేస్తున్నాయి. సికింద్రాబాద్, చందానగర్, ఫతేనగర్, తదితర ప్రాంతాల్లో గుట్టలుగా స్వాధీనం చేసుకున్న నకిలీ టీ పొడిని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలలో పరీక్షించగా.. అందులో హానికర సింథటిక్ రంగులను ఉపయోగించినట్లు వెల్లడైంది. టీ పొడితోపాటు.. మంచి ఆరోగ్యం కోసం తినే ఎండు 'కివి' పండు ముక్కలు, బెల్లంలోనూ హానికర రంగును కలిపినట్లు పరీక్షల్లో తేలింది.

**సింథటిక్ కలర్స్ కలుపుతూ...**

రెండేళ్లుగా నగరంలో విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి. పోలీసులు, ఆహార భద్రతాధికారులు ఇప్పటి వరకు రెండు నుంచి మూడు టన్నుల నకిలీ టీ పొడిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అక్టోబరు, 2024లో ఫతేనగర్‌లో 300కేజీల కల్తీ టీ పొడి, 200 కేజీల కొబ్బరి చిప్పల పొడి స్వాధీనం చేసుకున్నారు. జగన్నాథ్ కోణార్క్ టీ పొడరు పేరుతో ప్యాకింగ్ చేసినట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. డిసెంబరు, 2024లో చందానగర్‌లోని ఓ ఇంట్లో 150 కేజీల నకిలీ పొడిని పట్టుకున్నారు. అందులో కేజీ చొప్పున ఉన్న 130 ప్యాకెట్లు ఉండటం గమనార్హం. 500గ్రాముల ఇడకోల్ సన్‌సెట్ ఎల్లోకలర్, 500గ్రాముల నీల్ కియాన్ కలర్, 12 ఇలాచి వాసన వచ్చే ద్రవం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకోగా. చందానగర్ సర్కిల్ ఆహార భద్రతాధికారి హృదయ ఆ నమూనాలను ప్రయోగశాలకు పంపారు. టీ పొడిలో హానికర రంగును కలిపినట్లు తేలింది. ఎల్బీనగర్‌లో ఈ ఏడాది మార్చిలో చేపట్టిన తనిఖీల్లోనూ నకిలీ పొడి పెద్దయెత్తున దొరికింది. అందులోనూ రంగు ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. నామమాత్రపు పొడి..రంగుతో ఎక్కువ తేనీటిని తయారు చేసేందుకు సింథటిక్ రంగులను ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాంటి తేనీటితో క్యాన్సర్ వంటి ప్రమాదాకర వ్యాధులకు గురవుతారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండు పండ్లలోనూ..**

2025 ఫిబ్రవరి 1న చందానగర్‌లోని ఓ సూపర్‌మార్కెట్లో లూజ్ డ్రైడ్ కివీ ముక్కలను స్వాధీనం చేసుకుని, ప్రయోగశాలకు పంపించగా, వాటిలో సింథటిక్ రంగును పెద్దయెత్తున ఉపయోగించినట్టు ప్రయోగశాల స్పష్టం చేసింది. ముదురు పసుపు రంగులోకి మారే ఎండు కివీ ముక్కలు, ఆకు పచ్చని రంగులో ముంచి, స్వల్పంగా వాటిపై చక్కెర ద్రవాన్ని పిచికారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

**తింటే ఆస్పత్రికే..**

గతంతో పోలిస్తే చాలా మంది వ్యాపారులు ఆహార పదార్థాల తయారీలో రంగుల వినియోగాన్ని ఆపేశారు. తనిఖీలకు వెళ్లినప్పుడు.. వంట మనుషులు, హోటళ్ల యాజమాన్యాలకు రంగుల వాడకం వల్ల వినియోగదారులకు తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్టు ఎఫ్ఎస్ఓ హృదయ తెలిపారు. సింథటిక్ రంగులకు బదులు.. కశ్మీరీ మిరప పొడి ద్రవం, కుంకుమ పువ్వు ద్రవం, హల్దీ పొడిని ఉపయోగించాలని సూచిస్తున్నామన్నారు. సింథటిక్ రంగులతో చేసే ఆహారోత్పత్తులను తింటే.. దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# భళా.. తపాలా..!

సూర్యాపేట: తపాలాశాఖ పొదుపు ఖాతాలను తెరిచి తమ సేవలను బలోపేతం చేస్తోంది. ప్రైవేటు రంగానికి దీటుగా సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. వివిధ పొదుపు ఖాతాలతోపాటు పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ బీమా సేవలతో ప్రజలకు మరింత చేరువుతోంది. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల్లో నమ్మకం పెంచుకొని గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శాఖకు కేటాయించిన లక్ష్యం చేరుకుంటోంది. ఏటా ఆర్థిక సంవత్సరంలో విధించిన లక్ష్యంపై దృష్టి సారించి శాఖ అభివృద్ధికి అధికారులు తోడ్పడుతున్నారు.

**ఇదీ పరిస్థితి..** జిల్లాలో ప్రధాన తపాలా కార్యాలయాలు 2, ఉప తపాలా కార్యాలయాలు 27, పోస్టాఫీసులు 319 ఉన్నాయి. వీటన్నింటిలో తపాలా శాఖకు సంబంధించిన వివిధ రకాల పొదుపు, బీమాకు సంబంధించి తపాలా శాఖకు 95,500 పొదుపు ఖాతాలు లక్ష్యం విధించగా ఇప్పటి వరకు 83,935 ఖాతాలు తెరిచారు. పీఎల్ఐ రూ.15.45 కోట్లు లక్ష్యం విధించగా రూ.15.64 కోట్లకు చేరుకున్నారు. అలాగే ఆర్‌పీఎల్ఐ 12.54 కోట్ల లక్ష్యంగా.. రూ.13.69 కోట్లు లక్ష్యం చేరుకోగా స్పీడ్‌పోస్టు రూ.44.87 లక్షల లక్ష్యం విధించగా రూ.50 లక్షలకు చేరుకున్నారు.




**మే 31 వరకు పునరుద్ధరించుకోవాలి..** వెంకటేశ్వర్లు, తపాలాశాఖ సూపరింటెండెంట్, సూర్యాపేటమే 31 వరకు పాలసీలు పునరుద్ధరణ చేసుకోవాలి. లేనిపక్షంలో వడ్డీ మినహాయింపు ఉండదు. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ, పాలసీలు ఏడాదిపాట విషయమై గమనించి తమ పాలసీలు తిరిగి చెల్లించాలి.

# గడ్డకట్టని రక్తం.. ప్రమాదానికి సంకేతం

మిర్యాలగూడ :సాధారణంగా ఏదైనా గాయమైనప్పుడు రక్తం కారి..తర్వాత దానంతట అదే గడ్డ కట్టి కారడం ఆగిపోతుంది. అయితే చిన్న గాయమైనా సరే తీవ్ర రక్తస్రావం అయితే అది హిమోఫీలియా వ్యాధిగా అనుమానించి..తక్షణమే వైద్యులను సంప్రదించాలి. హిమోఫీలియాను రక్తస్రావ రుగ్మత, రక్తం గడ్డ కట్టని వ్యాధిగా పిలుస్తారు. ఇది జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధి. ఈ వ్యాధి పట్ల ప్రజలో సరైన అవగాహన లేక అనేక మంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఏటా ఏప్రిల్ 17న 'ప్రపంచ హిమోఫీలియా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

వ్యాధి రెండు రకాలు..

హిమోఫీలియా వ్యాధి ఏ, బీ రెండు రకాలుగా ఉంటుంది. ఏ సాధారణ వ్యాధి. ఇది ప్రోటీన్-8 లోపం వల్ల వస్తుంది. బీ వ్యాధి ప్రోటీన్-9 లోపం వల్ల సంభవిస్తుంది. ఇది అత్యంత అరుదు, ప్రమాదకరమైంది.

**లక్షణాలు ఇవీ..**

శస్త్ర చికిత్స సమయంలో అధిక రక్తస్రావం.

చిన్నగాయమైనా ఎక్కువ రక్తం కారడం.

శరీరంపై నీలి మచ్చలు.

మూత్రం, మలంలో రక్తం పడడం.


ముక్కు నుంచి రక్తం కారడం.

గుండె, మెదడు వంటి అంతర్గత అవయవాల్లో రక్తస్రావం.

చిగుళ్లలో రక్తస్రావం.

కీళ్లలో వాపు, నొప్పి.

జాగ్రత్తలే మార్గం..




హిమోఫీలియా వ్యాధికి శాశ్వత చికిత్స లేదు. తగు జాగ్రత్తలు పాటిస్తూ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ వ్యాధి ఎక్కువగా పురుషుల్లోనే వస్తుందని నిపుణులు గుర్తించారు. సాధారణ వ్యక్తుల కంటే ఈ వ్యాధి సోకిన వారి జీవిత కాలం సుమారు 10 సంవత్సరాలు తగ్గుతుంది. దెబ్బలు తగిలినప్పుడు రక్తం ఆగకుండా కారడంతో ప్రాణానికే ముప్పు వాటిల్లవచ్చు. ఈ వ్యాధి ఉన్న వారు ఫుట్‌బాల్, రెజ్లింగ్ వంటి క్రీడలకే దూరంగా ఉండడంతో పాటు కొన్ని రకాల నొప్పి నివారణ మాత్రలు వాడకూడదు. కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే తప్పనిసరిగా కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకోవాలి. మరోవైపు వ్యాధి ఉన్న వారు నడక, సైక్లింగ్, ఈత కొట్టడం వల్ల కొన్ని ఉపయోగాలు ఉంటాయి.

లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

డాక్టర్ నగేశ్, పీఎం జన్‌మన్ ప్రోగాం అధికారి, నల్గొండ.

చిన్న గాయానికి కూడా తీవ్రంగా రక్తం కారే లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. హిమోఫీలియాలో ఏ రకానికి చెందిన వారో గుర్తించి చికిత్స మొదలుపెడతారు. ఇది జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధి. సుమారు 20వేల మందిలో ఒకరికి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఈ వ్యాధి పట్ల అవగాహన లేక చికిత్సకు ముందుకు రావడం లేదు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా ఇలాంటి వ్యాధి బాధితులను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

# ఇళ్ల నిర్మాణాలు.. ఇనుప కంచెలు

మోతె : తహసీల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రూ.2 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఇళ్ల స్థలాల భూమిని దొరికిన వాళ్లు దొరికినంత ఆక్రమించుకుంటున్నారు. మండలకేంద్రంలోని సర్వే సంఖ్య-238లో 5.21 ఎకరాలను దశాబ్దాల క్రితం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఏళ్ల క్రితం కొందరు పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా ఎవరూ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం ఈ భూమి సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో విలువ అమాంతం పెరిగింది. ఇంకేం అందరి కన్ను ఖాళీ స్థలాలపై పడింది. ఆక్రమిత స్థలాల్లో ఆక్రమణదారులు కొందరు ఏకంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మరికొందరు గడ్డివాములు, పెంటదిబ్బలు వేస్తున్నారు. కొందరైతే ఇనుప కంచెతో హద్దులు ఏర్పాటు చేసి అట్టి పెట్టుకున్నారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దార్ లావణ్యను వివరణ కోరగా.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, ఇళ్ల నిర్మాణంపై



క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ భూమిలో గత ప్రభుత్వం 64 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పంచింది. ఈ సముదాయంలో ఇంకా ఎకరాకు పైగా ఖాళీ స్థలం ఉంది. ఈ ఖాళీ జాగాను స్థానికులు ఇష్టారీతిన ఆక్రమించారు. ఈ అక్రమ తతంగం అంతా తహసీల్ కార్యాలయం పక్కనే జరుగుతోంది. అయినా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు అరెకరం విస్తీర్ణానికి పైగా స్థలం ఆక్రమణకు గురైంది. ఇక్కడ బహిరంగ మార్కెట్లుచి గజం రూ.10వేలు ధర పలుకుతోంది. ఈ ధరలతో పోలిస్తే ఆక్రమిత భూమి విలువ తక్కువలో తక్కువ రూ.2 కోట్లు దాటుతుందని స్థానికులే చెబుతున్నారు.

# కార్పొరేషన్ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు

కొత్తగూడెం: కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు మరో ముందడుగు పడనుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు అంశంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాసనసభ ఆమోదం అనంతరం గెజిట్‌ను గవర్నర్ జారీ చేయాల్సి ఉంటుంది. కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలతో కార్పొరేషన్ ఏర్పడనుంది.

**'గూడెం'కు మహర్దశ..**

కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటైతే 'గూడెం' అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఓవైపు కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడుతుండగా.. మరోవైపు కార్పొరేషన్ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే జంట పట్టణాల్లో వ్యాపారాలు ఊపందుకుంటా



యని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ఏర్పాటైతే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు అభివృద్ధికి ఊతమిస్తాయంటున్నారు. ముఖ్యంగా నూతన పరిశ్రమలు, వ్యాపారాల స్థాపనకు మార్గం సుగమమవుతుందని చెబుతున్నారు.

**ఎమ్మెల్యే చొరవకు ప్రభుత్వ తోడ్పాటు**

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు విన్నవించారు. సీఎం సానుకూలంగా స్పందించారు. అందుకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పొరేషన్ అంశాన్ని అసెంబ్లీలో ఆమోదం కోసం తీర్మానం ప్రవేశపెట్టారు.

**1,98,182 మంది జనాభా, 85.22 చ.కి.మీ. వైశాల్యం**

కొత్తగూడెం పట్టణంలోని 36, పాల్వంచలోని 24 వార్డులతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుకానుంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో 97,337 మంది, పాల్వంచ మున్సిపాలిటీలో 89,721 మంది, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలో 11,124 మంది జనాభాతో కలిపి 1,98,182 మంది కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఉండనున్నారు. కొత్తగూడెం వైశాల్యం 15.87 చ.కి.మీ., పాల్వంచ 40.87, సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీలు కలిపి 28.48 చదరపు కిలోమీటర్లతో మొత్తం 85.22 చ.కి.మీ వైశాల్యంతో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు కానుంది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుతోనే సాధ్యం. ఈ విషయంపై ఏడాది కాలంగా ప్రభుత్వంతో మాట్లాడుతున్నా. ఎట్టకేలకు కార్పొరేషన్ అంశం అసెంబ్లీ ఆమోదం కోసం తీర్మానం ప్రవేశపెట్టారు. త్వరలోనే సానుకూల నిర్ణయం రానుంది. ఇందుకు సహకరిస్తున్న సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు. కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే

# అంగన్‌వాడీ తరహా అమలుతో మేలు

చెన్నూరు ః సర్కారు బడులకు వచ్చే పిల్లలకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్న ప్రభుత్వం వారికి కోడిగుడ్డును అందిస్తోంది. వారంలో మూడు రోజులపాటు ఇది అందించాలని నిబంధనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలే వీటిని దుకాణాల్లో కొనుగోలు చేసి పిల్లలకు అందిస్తున్నారు. అయితే ప్రధాన పట్టణాల్లో ప్రస్తుతం రూ. 5కే లభిస్తోంది. కానీ ఉమ్మడి జిల్లాలోని చెన్నూరు, కాసిపేట, కన్నెపల్లి, భీమిని వంటి ప్రాంతాల్లో రూ.6 నుంచి రూ. 7 వరకు విక్రయిస్తునారు. అయితే ప్రభుతం కోడిగుడ్డుకు రూ. 6 చెల్లిస్తోంది. అయినా కొన్నిచోట్ల మహిళలు రూపాయి భారాన్ని మోస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన డబ్బులు నెలనెలా మంజూరు కాకపోవడంతో నిత్యావసరాల పెరగడం, తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చాలా బడుల్లో వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే అందిస్తున్నారు.

ప్రభుత్వం నేరుగా కోడిగుడ్లు సరఫరా చేస్తే ప్రయోజనం

విపణిలోని ధరతో పోల్చితే గుడ్డుకు ప్రభుత్వం చెల్లించే ధర తక్కువగా



ఉండటంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పిల్లలకు సక్రమంగా గుడ్డును అందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల మాదిరిగా పాఠశాలల్లో కూడా ఏజెన్సీల ద్వారా అందించాలి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒకేసారి గుడ్లను సరఫరా చేయడం ద్వారా పిల్లలకు సక్రమంగా వడ్డించే అవకాశాలు ఉంటాయి. తద్వారా పిల్లలకు సరైన పోషకాలు అందుతాయి. దీని ద్వారా పిల్లలకు ప్రయోజనం కలగడంతోపాటు నిర్వాహకులకు గుడ్డు భారం తప్పుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని పోషకులు కోరుతున్నారు.

**భారం తప్పించాలి**

విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్డు ధరను ప్రభుత్వం రూపాయి పెంచినా తమకు ఆర్థిక భారం తప్పడం లేదు. మారుమూల ప్రాంతాల్లోని దుకాణాల్లో ధర రూ.7 ఉంది. గుడ్డు భారం తమకు తప్పించేలా ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలి. – కోర్తె రాజమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, లింగంపల్లి

# ఫీజు చెల్లించినా.. తప్పదు నిరీక్షణ




హైదరాబాద్ : అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కింద చాలామంది ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ.. ఆయా ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ అయినట్లు ప్రొసిడింగ్స్ రావాలంటే ఇంకా కనీసం 2 నెలల పాటు నిరీక్షణ తప్పదు. దరఖాస్తుల పరిశీలన..ఎల్–1 అనుమతులు వచ్చిన తర్వాతే ప్రొసిడింగ్స్ ఇవ్వనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 3.2 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాథమికంగా ఎలాంటి ఇబ్బంది లేని దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే ఫీజు చెల్లింపు కోసం ఆయా దరఖాస్తుదారులకు సమాచారం అందించారు. దీంతో చాలామంది ఫీజులు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆసక్తి చూపుతున్నారు. అయితే ఫీజులు చెల్లించిన తర్వాత దరఖాస్తుదారులకు ప్రొసిడింగ్స్ లేదా కనీసం రశీదులు కూడా ఆన్‌లైన్‌లో కన్పించడం లేదు. దీంతో చాలామంది అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇంకా సమయం పడుతుందనే సిబ్బంది సమాధానమిస్తున్నారు.

**జాప్యానికి కారణాలు ఇవే..**గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేస్తే...తొలుత లేఅవుట్‌ను పరిశీలించి.. దాని పరిసరాల్లో చెరువులు, కాల్వలు.. లేదంటే ఆ స్థలాలు వివాదస్పద భూ ఖాతాలో ఉన్నాయా... ఇలా అన్నీ పరిశీలించి సక్రమమని తేలితేనే ఫీజుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేవారు. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితి నెలకొంది. తొలుత ఆయా లేఅవుట్లను పరిశీలన చేయకుండానే దరఖాస్తుదారులకు ఫీజు నోటీసులు అందిస్తున్నారు. ఫీజులు చెల్లించిన తర్వాతే సంబంధిత లేఅవుట్ సక్రమంగా ఉందా లేదా..అని అధికారులు పరిశీలిస్తున్నారు. ఉదాహరణకు లేఅవుట్‌లో ఒక ప్లాట్‌కు ఎల్‌ఆర్‌ఎస్, ఓపెన్‌స్పేస్ ఛార్జీలతో కలిపి రూ.లక్ష చెల్లించారనుకుందాం. ఒకవేళ అలాంటి దరఖాస్తు తిరస్కరిస్తే...రూ.90 వేలు మాత్రమే వెనక్కి వస్తుంది. ప్రాసెసింగ్ ఛార్జీలు కింద రూ.10 వేలు కోత విధిస్తారు.

# చి'వరి' దశలో దైన్యం



జగిత్యాల : జిల్లాలో వానాకాలంలో సాధారణం మించి వర్షం కురిసినా.. ప్రస్తుతం ఆయకట్టుకు కాలువ నీళ్లు వస్తున్నా.. చాలాచోట్ల పంటలకు సాగు నీరందని దైన్యం నెలకొంది. సాధారణం కన్నా 3–5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఎండలతో నీటి అవసరం ఎక్కువున్న తరుణంలోనే భూగర్భ జలమట్టం వేగంగా అడుగంటడం, చివరి ఆయకట్టుకు కాలువ నీరు అందకపోవటంతో పైర్లు ఎండుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలాఉంటే పంటలు పూర్తయ్యే ఏప్రిల్ చివరి వరకు పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నీటి తరలింపు సామర్థ్యం తగ్గి..

శ్రీరామసాగర్ కాకతీయ కాలువతో పాటుగా డిస్ట్రిబ్యూటరీలు, ఇతర కాలువల లైనించ్ చాలాచోట్ల దెబ్బతినగా చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితర కారణాలతో కాలువల్లో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు చాలాచోట్ల దెబ్బతినటంతో ఏ కాలువనిండా నీటిని తరలించలేక చివరి ఆయకట్టుకు నీరందటం లేదు. మరోవైపు కాలువలకు అమర్చిన వేల సంఖ్యలోని మోటార్లు నీటిని ఎత్తిపోయటంతో చివరికి నీరు పారటం లేదు.

ఎస్సారెస్పీ నుంచి జోన్–2 ఆయకట్టుకు ఏప్రిల్ 2వ తేదీ వరకు, జోన్–1 ఆయకట్టుకు ఏప్రిల్ 9వ తేదీ వరకే నీరివ్వాలని అధికారులు నిర్ణయించినా నీటితడులను పొడిగించాలని కర్షకులు కోరుతున్నారు. కాకతీయ కాలువకు అమర్చిన 3 వేలకుపైగా మోటార్లను పరిమిత సమయం మేరకే నడిపించి చివరి ఆయకట్టుకు నీరుపారేలా చూడాలి. కాకతీయ కాలువకు అధిక మొత్తంలో నీటిని విడుదలచేసి కాలువల చివరి భూములతో పాటుగా గొలుసుకట్టు చెరువులు, కుంటల్లోకి తరలిస్తే భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగి పంటలను కాపాడుకోవచ్చు.

ఇప్పటికే చాలా గ్రామాల్లో భూగర్భ జలమట్టం అడుగంటడంతో క్రేన్లు, పొకెయిన్ల సాయంతో బావుల్లో పూడికతీత పనులను రైతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా బావుల్లో పూడిక తీతను చేపడితే రైతులకు ఆసరాగా ఉంటుంది. నీటి పొదుపునకు ఉపకరించే బిందుసేద్య పరికరాలను తక్షణమే గ్రౌండింగ్ చేయాలి. జిల్లాలో వాగులపై తలపెట్టిన 75 ఆనకట్టల నిర్మాణాన్ని పూర్తిచేస్తే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగుతుంది.

జిల్లాగుండా పారే వరద కాలువకూ రైతులు పెద్దఎత్తున మోటార్లను అమర్చి పంటలను సాగు చేశారు. వరద కాలువ నుంచి అమర్చిన తూముల ద్వారా గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలించాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోనూ 23 టీఎంసీల నీరు మాత్రమే నిలువుండటంతో చివరివరకు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలి. మరోవైపు భూగర్భ జలాన్ని సమర్థంగా వినియోగించుకునేలా విద్యుత్తు కొరత తలెత్తకుండా చూడాలి.

జిల్లాలో ఇలా (ఎకరాల్లో.. )

యాసంగి సాధారణ సాగు 3,15,620

అన్నిపంటలు సాగు చేసినది 3,36,537

వరి సాగు 2,82,790

నీరందని పొలాలు 29,000

భూగర్భ జలమట్టం (మీటర్లలో..)

డిసెంబరు 3.94

జనవరి 4.55

ప్రస్తుతం 5.21

# వాహనాలు ఇలా.. చెత్త సేకరణ ఎలా!

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ పురపాలక సంఘం రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణంలో ప్రతి రోజు చెత్తసేకరించి తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులు చర్యలు చేపడుతున్నారు. కాగా వ్యర్థాలను సేకరించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోజుల వ్యవధిలో మూలకు చేరుతుండటంతో పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మున్సిపాలిటీ మొత్తం 28 వార్డులుగా విస్తరించి ఉంది. ప్రతీరోజు చెత్త సేకరణ చేయాల్సి ఉన్నప్పటికీ వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో పూర్తి స్థాయిలో సేకరణ జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు 20 ఆటోలు ఉండగా 15 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వీటితో పాటు మరో 8 ట్రాక్టర్లున్నాయి. మరమ్మతులకు గురైన వాటిని మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో నిలిపి ఉంచారు. పట్టణంలో రెండు చిన్న వార్డులకు ఒకటి చొప్పున, పెద్ద వార్డుల్లో ఒకటి చొప్పున చెత్త ట్రాక్టర్లను తిప్పుతున్నారు. వాహనాల కొరత కారణంగా కొన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు చెత్త సేకరణకు వస్తున్నట్లు పలు వార్డుల ప్రజలు చెబుతున్నారు.

**అయిదేళ్ల క్రితం కొనుగోలు...**

మున్సిపల్‌లోని చెత్త వాహనాలను దాదాపు అయిదేళ్ల క్రితం కొనుగోలు చేశారు. వీటి నిర్వహణ సక్రమంగా లేక తరచూ మొరాయిస్తున్నాయి. మూలకు చేరిన ఆటోలు నెలల తరబడి మరమ్మతుల షెడ్డులోనే ఉన్నాయి. కొన్ని మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో తుప్పు పడుతున్నాయి. ఆయా వాహనాలు నడిపేందుకు ప్రత్యేకంగా డ్రైవర్లు లేరు. పారిశుద్ధ్య సిబ్బందిలో డ్రైవింగ్ వచ్చిన కొందరు వాటిని నడుపుతున్నారు. ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టకపోవడంతో అవి మూలకు చేరుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త సేకరణ సమయంలో ఎక్కడ నిలిచిపోతాయో అని భయపడాల్సిన దుస్థితి నెలకొందని సిబ్బంది పేర్కొంటున్నారు. పాత వాటికి మరమ్మతులతో పాటు కొత్తగా వాహనాల కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పలుచోట్ల అధ్వానం...**

ఆధ్యాత్మిక పట్టణం కావడంతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగిస్తున్నప్పటికీ ప్రధాన రహదారుల వెంబడి దుకాణ దారులు, లాడ్జీలు ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపిస్తుందని స్థానికులు అంటున్నారు. కొందరు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను రోడ్డుపై, మురుగు కాలువల్లో పడేస్తున్నారు.



పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉదయం, రాత్రి వేళల్లో చెత్త సేకరిస్తున్నప్పటికీ శివారు వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు సరిగా చేపట్టడం లేదని ఇక్కడి ప్రజలు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**క్రమం తప్పకుండా సేకరణ**

చెత్త సేకరించే ఆటోలు కొన్ని మరమ్మతుకు గురైనప్పటికీ సేకరణ పూర్తి స్థాయిలో జరుగుతోంది. పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చెత్త సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉదయం, రాత్రి వేళల్లో వాహనాల ద్వారా సిబ్బంది సేకరిస్తున్నారు. వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో వేయాలి. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

కిరణ్‌కుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేములవాడ.

వేములవాడ మున్సిపల్‌లో వార్డుల సంఖ్య : 28

పట్టణ జనాభా : 56 వేలు

చెత్తసేకరణ ఆటోలు: 20

మరమ్మతులకు గురైనవి: 5

చెత్త ట్రాక్టర్లు : 8

పట్టణంలో రోజూ చెత్త సేకరణ : 21 టన్నులు

పారిశుద్ధ్య సిబ్బంది : 140

# మున్సిపాల్టీలో ప్రమాద ఘంటికలు

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ మున్సిపాల్టీకి నీటి ఎద్దడి తప్పేలా లేదు. దశాబ్దాలుగా పట్టణ ప్రజల దాహం తీరుస్తూ వరప్రదాయినిగా పేరొందిన పట్టణ శివారులోని లాండసాంగ్వి వాగు ఎండిపోవడం అందరిని కలవరపెడుతోంది. దానిపై ఆధారపడ్డ పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగరథ నీళ్లు సరిపడా రావడం లేదు. ఆదినుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు పట్టణ డిమాండ్‌కు సరిపడా ఇవ్వడం లేదనేది పుర అధికారుల వాదన. ఈ కారణంతోనే పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని లాండసాంగ్వి గ్రామ సమీపంలో వాగు వద్ద నిర్మించిన పాత పథకాన్ని వినియోగిస్తున్నారు. గతంలో సాత్నాల ప్రాజెక్టులో నీటిబొట్టు లేకున్నా, గోదావరి నది ఎండిపోయినా లాండసాంగ్వి వాగులో నీరుండేది. వాగుల్లో అక్కడక్కడ ఉన్న ఊటల నుంచి నీరు రావడంతో ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉండేది. సాత్నాల



వరద నీరు ఇందులోనే కలుస్తుంది. ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా జైనథ్‌లోని నిరాల, పెండల్‌వాడల మీదుగా పెన్‌గంగలో కలిసే ఈ వాగు ఇప్పుడు ఎండిపోయింది.

**ఇక్కట్లు మొదలు..**

వాగులోనే తవ్విన రెండు ఊటబావుల నుంచి పథకంలోని ఇన్‌టేక్‌వెల్‌కు నీరు పంపిస్తే మోటార్ల ద్వారా పట్టణంలోని మున్సిపల్ ట్యాంకుల వద్దకు నీరు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని క్లోరినేషన్ చేసిన అనంతరం పలు కాలనీల్లో ఇంటింటికి అందిస్తున్నారు. ముఖ్యంగా తిర్పల్లి, మహాలక్ష్మీవాడ, బ్రాహ్మణవాడ, కుమర్‌పేట్, చించర్‌వాడ, కోలిపుర, బొక్కల్‌గూడ, ఖుర్షాపూర్, ఖిల్లా, వినాయక్‌చౌక్, మోచీగల్లి, రవీంద్రనగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డులకు ఈ పథకం నుంచి నీరందిస్తున్నారు. ఊటబావుల్లో నీరు లేక బుధవారం నుంచి సరఫరా నిలిచిపోనుంది. ఈ కాలనీల్లో భగీరథ సైతం సరఫరా అవుతున్నా సరిపోక సమస్య తీవ్రంకానుంది.

# అప్పుడు అక్రమం.. ఇప్పుడెలా సక్రమం

ఆసిఫాబాద్: ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాదార్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్లాట్లుగా రూపాంతరం చెంది భవనాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇవి ఆక్రమణలేనని నిర్ధారించిన అధికారులు కట్టడాలను కూల్చేశారు. అనంతరం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో.. రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కలెక్టరేట్కు సమీపంలోనే ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ అటువైపు వెళ్లకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కారీ స్థలాలకు కాపాడాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల ఆవిర్భావం అనంతరం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో భూ మాఫియా వ్యక్తులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో తాము కన్నేసిన భూములను కాజేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 11, 64, 42లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. రెండేళ్ల కిందట ఈ ప్రాంతంలో 12 నివాస సముదాయాలను, మరికొన్ని తాత్కాలిక కట్టడాలను, ప్రహరీలను



అధికారులు తొలగించారు. జేసీబీతో కూల్చివేశారు. మళ్లీ తాజాగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. సమీపంలోనే కలెక్టరేట్ భవనం ఉన్నా.. కబ్జాలు కొనసాగడం గమనార్హం.

అదనంగా ఇవ్వాల్సిందే..

నస్పూర్‌లో సర్వే నం.11, 64, 42లలో లావుణి పట్టాలు ఉన్నాయి. ఇక్కడ క్రయ విక్రయాలు, నిర్మాణాలు నిషేధం. అయితే 2023లో కూల్చివేసిన చోటే ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఓ నాయకుడి ప్రధాన అనుచరుడు అన్నీ తానై ముందుండి వ్యవహారం నడిపిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. కూల్చేసిన చోటుతోపాటు, ఖాళీగా ఉన్న సర్కారీ స్థలాల్లో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతోపాటు, భవన నిర్మాణ పనులు సైతం సదరు నేతకు సంబంధించిన బిల్డర్ చేస్తున్నారు. అంటే భవనానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయితే మరో రూ.5 లక్షలు అదనంగా ఇవ్వాలన్నమాట. ఈ తరుణంలో కొందరు వ్యక్తులు సదరు నేతకు అడిగినంత ఇచ్చి భవన నిర్మాణ పనులు ప్రారంభించారని సమాచారం.

## ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు

మంచిర్యాల: భానుడు భగభగ మండుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో మంచిర్యాల కూడా ఉంది. ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుందే తప్ప తగ్గడం లేదు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బ బారిన పడే అవకాశముంది. దీంతోపాటు వేసవికాలంలో ఎక్కువగా వచ్చే డీహైడ్రేషన్ తదితర రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. వీటి నియంత్రణకు ఆరోగ్యశాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్యకేంద్రాలకు సరిపడా మాత్రలు, సూది మందు, సెలైన్లను సరఫరా చేసినట్లు ఇక్కడి సీఎంఎస్(కేంద్ర ఔషధ గిడ్డంగి) బాధ్యులు తెలుపుతున్నారు.

**ఓఆర్‌ఎస్ నుంచి డీఎన్‌ఎస్ వరకు..**వేసవికాలంలో ఆరోగ్యకేంద్రంతో పాటు ఇళ్లలోనూ ఓఆర్‌ఎస్ పొట్లాలు ఉంచుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం వీటి నిల్వలు జిల్లాలోని జీజీహెచ్ నుంచి సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో సరిపడా ఉన్నట్టు సీఎంఎస్‌లోని లెక్కలు చెబుతున్నాయి. వేసవిలో అత్యవసరమయ్యే ఓఆర్‌ఎస్ నుంచి ఎన్‌ఎస్, ఆర్‌ఎల్, డీఎన్‌ఎస్, మెట్రోజిల్ సెలైన్లు సరిపడా ఉన్నాయని, ఎప్పటికప్పుడు నిల్వలు అందుబాటులో ఉంచుకుంటున్నట్లు, ఆరోగ్యకేంద్రాల అవసరం మేరకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బందికి సైతం కొంత మేరకు అత్యవసర మందులను వెంట ఉంచుకోవాలని సూచించినట్టు వైద్యాధికారులు వివరించారు.



# ఒక్క దెబ్బకు జగన్‌కు రెండు షాకులిచ్చిన చంద్రబాబు..!

అమరావతి : ఒక్క దెబ్బకు రెండు షాకులు అంటే.. ఎలా ఉంటుందో చంద్రబాబు చేసి చూపించారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు సౌండ్ లేకుండా చేశారు. కీలకమైన రెండు విషయాల్లో చంద్రబాబు చేసిన రాజకీ యం వైసీపీ నేతలకు నోట మాట రాకుండా%ొ% లేకుండా కూడా చేసింది. 1) మత్స్యకారులకు ఇచ్చే భృతి. 2) పాస్టర్లకు ఇచ్చే గౌరవ వేతనం. ఈ రెండు విషయాలను వైసీపీ తనఖాతాలో వేసుకుంది. ఈ రెండు కూడా.. చంద్రబాబు అమలు చేయలేదని ప్రచారం చేస్తోంది. వాస్తవానికి 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు ఈ రెండు పథకాలను కూడా.. కూటమి సర్కారు పట్టించుకోలే దనే చెప్పాలి. గత ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో భృతిఇవ్వాల్సి ఉంది. కానీ, అప్పటికి ప్రభుత్వం ఏర్పడకపోవడంతో కూటమి సర్కారు నేతలు మౌనంగా ఉన్నారు. దీంతో అప్పట్లోనే వైసీపీ యాగీ చేసింది. మత్స్యకారులకు వైసీపీ మేలు చేసిందని.. కూటమిపట్టించుకోవడం లేదని పేర్కొంది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు కూడా సంధించింది. ఇక, పాస్టర్ల విషయాన్ని కూడా.. వైసీపీ రాజకీయం చేసింది. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు వారికి కూడా .. కూటమి సర్కారు రూపాయి ఇవ్వలేదు. వైసీపీ హయాంలో నెలకు రూ.5000 చొప్పున గౌరవ వేతనంగా అందించారు. అయితే.. కూటమి ఏర్పడ్డాక.. పింఛన్ల పెంపుదలకు ప్రాదాన్యం ఇచ్చారే తప్ప.. ఇతర విషయాల జోలికి పోలేదు. దీంతో ఇది కూడా వైసీపీకి అవకాశం ఇచ్చినట్టు అయింది. దీంతో పాస్టర్ల విషయాన్ని కూడా ప్రస్తావించాలని భావించారు. కానీ, వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్‌కు అవకాశం ఇవ్వకుండా.. సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది నుంచి బకాయి ఉన్న పాస్టర్ల గౌరవ వేతనాన్ని గురువారంరాత్రి రూ.30 కోట్ల వరకు విడుదల చేశారు. అంతేకాదు.. మత్స్యకార భరోసా కింద.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.20000 చొప్పున ఈ నెల 26న సీఎం చంద్రబాబు అందించేందుకు రెడీ అయ్యారు. ఈ రెండు విషయాల్లోనూ కూటమి సర్కారు జాగ్రత్తగా అడుగులు వేసింది. దీంతో వైసీపీనాయకులకు విమర్శించే ఛాన్స్ లేకుండా చేసుకున్నారు.

# గత ప్రభుత్వానికి చెత్తపన్నుపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదు: మంత్రి నారాయణ



నెల్లూరు: ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించుకుందామని మంత్రి నారాయణ తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా నెల్లూరులో వేలాది మందితో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత శుభ్రమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆలోచనలు, పరిసరాలు, ఇల్లు అన్నీ పరిశుభ్రంగా ఉంటేనే అంతా స్వచ్ఛంగా ఉంటుందని చెప్పారు. "ప్రజలందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిచ్చేది. ఆ ప్రభుత్వం కూడా చెత్త ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంది. జగన్ సర్కార్ చెత్తపన్నుపై పెట్టిన శ్రద్ధ పారిశుద్ధ్యంపై పెట్టలేదు. మున్సిపాలిటీ నిధులను కూడా దారి మళ్లించారు. పన్నుల ద్వారా వచ్చే మొత్తాన్ని మున్సిపాలిటీల అభివృద్ధికే వెచ్చించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. 123 మున్సిపాలిటీలు స్వచ్ఛతలో దూసుకెళ్తున్నాయి" అని నారాయణ తెలిపారు. అంతకు ముందు నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి నర్తకీ సెంటర్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర నినాదాలతో ట్రంక్ రోడ్డు హోరెత్తింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు నారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

# చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి ఆనం



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజు (ఏప్రిల్ 20) వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నాయకులంతా వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకోవాలన్నారు. అన్ని మతాల వారు తెదేపా కార్యకర్తలు, నేతలుగా ఉన్నారన్న ఆయన.. మసీదులు, చర్చిల్లోనూ ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఔన్నత్యాన్ని చాటుతూ చంద్రబాబు కోసం పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆత్మకూరులో పెద్ద ఎత్తున హోమం చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు.

# విజయసాయి రెడ్డి చరిత్ర బయటపెడతా: రాజ్ కసిరెడ్డి



అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కొన్నాళ్లుగా తనపై అసత్య ప్రచారం జరుగుతోందని రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) అన్నారు. తాను లేనప్పుడు సిట్ అధికారులు ఆఫీసుకు, ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారన్నారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన ఆరోపణలపై త్వరలోనే మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ఆడియోను విడుదల చేశారు. "మద్యం స్కామ్‌లో సిట్ రెండుసార్లు నోటీసులు ఇచ్చింది. దీనిపై న్యాయస్థానానికి వెళ్లాను. నిర్ణీత సమయం ఇచ్చి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. న్యాయరక్షణ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాను. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నాను. మద్యం కుంభకోణంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేశారు. నా న్యాయపోరాటం పూర్తయిన తర్వాత మీడియాను పిలిపించి.. ఆయన చరిత్ర బయటపెడతా" అని రాజ్ కసిరెడ్డి ఆడియోలో పేర్కొన్నారు.




రోమ్: ఖైదీలు ములాఖత్ సమయంలో తమ భాగస్వాములతో ఏకాంతంగా గడిపే వీలు కల్పించింది ఇటలీ ప్రభుత్వం. ఈ దేశంలో తొలిసారిగా ఓ జైలులో 'ఏకాంత గదుల'ను ఏర్పాటు చేశారు. ఖైదీలు తమ భాగస్వాములను ప్రైవేటుగా కలుసుకునే హక్కు ఉందని అక్కడి న్యాయస్థానం గతేడాది తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ వెసులుబాటు కల్పించారు. సెంట్రల్ ఉంబ్రియా ప్రాంతంలోని జైలు (%ఝుఅశ్రీ%)లో ఈ ప్రత్యేక సదుపాయాన్ని శుక్రవారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. దీనిపై ఖైదీల హక్కుల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. "ఏకాంత గదుల ఏర్పాటు మంచిదే. అయితే, దాన్ని వినియోగించుకొనే ఖైదీల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా చూసుకోవాలి" అని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. తమ జీవిత భాగస్వాములు లేదా దీర్ఘకాల సహజీవన భాగస్వాములను ప్రైవేటుగా కలుసుకునే హక్కు ఉందని, ఆ సమయంలో జైలు గార్డులు ఎవరూ అక్కడ ఉండకూడదు అని ఇటలీలోని కాన్‌స్టిట్యూషనల్ కోర్టు గతేడాది జనవరిలో తీర్పు వెలువరించింది. దానికి అనుగుణంగానే అధికారులు ఈ చర్యలు చేపట్టారు. అయితే, ఈతరహా సదుపాయం ఐరోపాలోని చాలా దేశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉంది. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్, స్వీడన్‌లోని కొన్ని జైళ్లలోనూ ఖైదీలకు ఏకాంత గదులు ఉన్నాయి. ఐరోపాలోనే అత్యంత కిక్కిరిసిన జైళ్లు ఇటలీలోనే ఉన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం.. ఈ దేశంలో 62వేల మంది ఖైదీలు వివిధ నేరాల్లో శిక్ష అనుభవిస్తున్నారు. జైళ్ల గరిష్ఠ సామర్థ్యం కంటే ఈ సంఖ్య 21 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇక, గత కొంతకాలంగా ఖైదీల ఆత్మహత్య ఘటనలు పెరుగుతున్నాయి. మానసిక అనారోగ్యంతో పలువురు బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీటిని అరికట్టేందుకు ఇప్పటికే అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఖైదీలు తమ కుటుంబసభ్యులకు ఎక్కువ సార్లు ఫోన్ చేసుకునే వీలు కల్పించారు. తాజాగా భాగస్వాములతో ఏకాంతంగా కలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న డిపోర్టేషన్ విధానంపై ఇతర దేశాల్లోనే కాకుండా అగ్రరాజ్యంలోనూ వ్యతిరేకతలు నెలకొంటున్నాయి. కిల్మార్ అబ్రెగో గార్సియా అనే వ్యక్తిని ట్రంప్ యంత్రాంగం ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన విషయంపై తీవ్ర దుమారం రేగింది. ట్రంప్ నిర్ణయాలను ఆయన రాజకీయ ప్రత్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. కాగా ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన కిల్మార్ అబ్రెగో గార్సియా 'ఎం-13' క్రిమినల్ ముఠాలో సభ్యుడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటూ.. షేర్ చేసిన ఫొటో.. మార్ఫింగ్ ఫొటో అని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు స్పందిస్తూ.. ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన కిల్మార్ అబ్రెగో గార్సియా 'ఎం-13' క్రిమినల్ ముఠాలో సభ్యుడని.. గ్యాంగ్ పేరుతో అతడు టాటూ కూడా వేయించుకున్నాడన్నారు. న్యాయస్థానాలు కూడా ఈవిషయాన్ని ధ్రువీకరించాయని, అమెరికాను గ్రేట్‌గా మార్చడానికే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నానన్నారు. దయచేసి తన పనిని తాను చేసుకోనివ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు. శుక్రవారం ట్రంప్ గార్సియా చేతివేళ్లకు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. "ఇటువంటి హింసాత్మక ముఠా సభ్యుడికి మద్దతిస్తూ.. ప్రతిపక్ష డెమోక్రాట్లు అతడిని అమాయకుడిగా పేర్కొంటున్నారు. అతడు క్రూర స్వభావం కలవాడని.. భార్యని తీవ్రంగా కొట్టి హింసిస్తాడని..అధికారులు పేర్కొన్నారు. అవన్నీ దృష్టిలోపెట్టుకొని ఇటువంటి చెడు స్వభావం గల వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరిస్తూ.. దేశాన్ని మళ్లీ గొప్పగా చేయడానికి కృషి చేస్తున్నాను" అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. అయితే ఇది ఆ వ్యక్తికి సంబంధించిన టాటూ కాదని.. చేతివేళ్ల ఫొటో తీసి దానిపై టాటూను టైప్ చేసినట్లుగా ఉందని పలువురు నెటిజన్లు అనుమానం వ్యక్తంచేశారు. మిన్నెసోటా రాష్ట్ర మాజీ సెనేటర్ లిండా హిగ్గిన్స్ దీనిపై స్పందిస్తూ.. ట్రంప్ తను చేస్తున్న చట్టవిరుద్ధమైన చర్యలు బాగా కనిపించేలా ఫొటోను రూపొందించారని అన్నారు. ఫొటోషాప్ గురించి ఆయనకు ఎవరైనా నేర్పించాల్సి ఉంటుందన్నారు. పలువురు నెటిజన్లు గార్సియాకు సంబంధించిన పాత చిత్రాలను పంచుకుంటూ.. ఆయన చేతివేళ్లపై 'ఎం-13' అక్షరాలు లేవని పేర్కొంటున్నారు.




తిరుపతి: వైకాపా హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. గోశాలలోని గోవులను ఒంగోలుకు తరలించి కమీషన్లకు అమ్మేశారని ఆరోపించారు. తిరుపతిలో తితిదే గోసంరక్షణశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆయన బాగోతం బయటపడుతుందని రికార్డులు ఎత్తుకెళ్లారని విమర్శించారు.

"భాజపా నేత సుబ్రమణ్యస్వామికి గోశాలలో అన్యాయాలు కనిపించలేదా? వైకాపాపై ఆయన ఎందుకు పిల్ వేయలేదు? తితిదే అంటేనే ఒంటికాలిపై లేచే సుబ్రమణ్యస్వామి నిజానిజాలు ఏంటో తెలుసుకోరా? గోశాలలో నలుగురు సభ్యులతో కూడిన కమిటీ వేస్తాం. ఇక్కడ ఏం జరుగుతోందన్నది కమిటీ తేలుస్తుంది.

వైకాపా చేసిన తప్పును మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తా. తితిదే గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి" అని బీఆర్ నాయుడు తెలిపారు.




విజయవాడ: మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణకు వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. విజయవాడలో సిట్ కార్యాలయానికి ఆయన ఇవాళ ఉదయం వచ్చారు. అనంతరం అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. జగన్ హయాంలో జరిగిన వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో.. భారీగా అనుచిత లబ్ధి పొందిన కంపెనీల్లో ఒకటైన అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వెనక రాజ్ కసిరెడ్డితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉన్నారని వైకాపా మాజీ నేత వి.విజయసాయిరెడ్డి నిన్న బయటపెట్టిన విషయం తెలిసిందే. నిన్న విజయసాయిరెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు మిథున్‌రెడ్డిని అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది.




# హ్యాపీ బర్త్‌డే అమ్మా.. విజయలక్ష్మికి షర్మిల శుభాకాంక్షలు

అమరావతి: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన తల్లి విజయలక్ష్మి 69వ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా షర్మిల భావోద్వేగపూరిత పోస్టు పెట్టారు.

'నాకు జన్మనిచ్చి.. నా జన్మకు సార్థకత చేసేలా.. ఎల్లప్పుడు అండగా ఉంటున్నారు. మీరు ఎప్పుడు సంతోషంగా ఉండాలి అమ్మా.. నీకు ఆ దేవుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలను, మనశాంతిని, ఆనందాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను' అని షర్మిల పోస్ట్ చేశారు. కానీ, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన తల్లికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారా లేదా అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. ఇటు పలువురు రాజకీయ నేతలు, వైఎస్ ఫ్యామిలీతో అనుబంధం ఉన్న వారు కూడా విజయలక్ష్మికు శుభాకాంక్షలు చెబుతున్నారు. వైఎస్ అభిమానులు కూడా విజయలక్ష్మికు సోషల్ మీడియాలో బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు.

## అందమైన ప్రకృతిలో అందాల ప్రగ్యా

తమిళ్ మూవీ 'విరాట్టు'తో 2014లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈమె మొదటి సినిమా కంచె అనుకుంటారు. కానీ అంతకు ముందు ఈమె మిర్చిలాంటి కుర్రాడు అనే సినిమాలో హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమా విడుదల అయిన తర్వాతే క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'కంచె' సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. కంచె సినిమా విడుదలైన వెంటనే ప్రగ్యా జైస్వాల్‌కి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కింది. ఆ సినిమాలో అందంతో పాటు నటనతో మెప్పించడంతో రాబోయే కాలంలో కాబోయే స్టార్ హీరోయిన్ అంటూ చాలా మంది ప్రగ్యాను ఆకాశానికి ఎత్తారు. కానీ ఆమెకు కాలం కలిసి రాలేదు. కంచె సినిమా తర్వాత ప్రగ్యా జైస్వాల్ చాలా సినిమాలు చేసింది. కానీ పెద్ద విజయాలను మాత్రం సొంతం చేసుకోలేక పోయింది. ఒక వేళ సినిమాలు సక్సెస్ అయినా ఆమెకు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. మొత్తంగా ప్రగ్యా జైస్వాల్ ఇండస్ట్రీలో అడుగు



పెట్టి పదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌లను సొంతం చేసుకోలేదు, అంతే కాకుండా స్టార్ హీరోలకు జోడీగానూ సినిమాలో నటించే అవకాశాలు దక్కించుకోలేక పోయింది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా షేర్ చేసే ఫోటోల కారణంగా మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు దాదాపుగా మూడు మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. దాంతో ఈమె ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతున్నాయి. తాజాగా నేపాల్‌లోని ఖాట్మాండ్‌కి వెళ్లింది. అక్కడ తీసుకున్న ఫోటోలను షేర్ చేసింది. వైట్ టాప్‌ను ధరించి, బ్లూ టైట్ జీన్స్ను ధరించిన ప్రగ్యా జైస్వాల్ మరోసారి ఆకట్టుకుంది. తన గత ఫోటో షూట్స్ మాదిరిగానే ఈ ఫోటోలతోనూ ప్రగ్యా చూపు తిప్పుకోనివ్వడం లేదు. అందమైన ప్రగ్యా జైస్వాల్ అందమైన ప్రకృతి మధ్య ఫోటోలు దిగితే లైక్ చేయకుండా ఎలా ఉంటాం అంటూ చాలా మంది ఈ ఫోటోలకు తెగ లైక్ చేస్తున్నారు. ఈమె ఫోటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే వేల కొద్దీ లైక్స్ నమోదు అయ్యాయి. మీరు చాలా అందంగా ఉన్నారు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ప్రగ్యా అందాలపై ప్రశంసలు కురిపిస్తూ కామెంట్ చేస్తున్నారు. 1991లో జన్మించిన ఈ అమ్మడు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. పూణేలోని సింబియోసిస్ లా స్కూల్ నుంచి విద్యను పూర్తి చేసిన ఈమె సింబియోసిస్ విశ్వ విద్యాలయంలో చదివింది. ఆ సమయంలోనే మోడలింగ్‌పై ఆసక్తితో ఉంది. ప్రస్తుతం తెలుగులో పెద్దగా సినిమా ఆఫర్లు దక్కించుకోలేక పోతున్న ఈమె ఇతర భాషల్లోనూ అడపా దడపా సినిమా ఆఫర్లు దక్కించుకుంటుంది. ప్రస్తుతం అఖండ 2 సినిమాలో నటిస్తున్న ప్రగ్యా జైస్వాల్ మరో వైపు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో టైసన్ నాయుడు సినిమాలోనూ నటిస్తున్న విషయం తెల్సిందే.

## సమంత ఆరోగ్య ప్రయాణం.. ఫ్యాన్స్‌కు మరో బిగ్ అప్‌డేట్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతా రూత్ ప్రభు గత కొంతకాలంగా సినిమాలకంటే కూడా తన పర్సనల్ లైఫ్ లో తీసుకుంటున్న నిర్ణయాలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తన సినీ జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ఒక సరైన ట్రాక్ లో ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్షన్, ఎమోషన్‌తో అలరించడమే కాకుండా, తన ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అభిమానులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రారంభించిన హెల్త్ యూట్యూబ్ కార్యక్రమం 'టేక్ 20'కి మంచి స్పందన లభిస్తోంది. తాజాగా, రెండో ఎపిసోడ్‌లో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ థామస్ లేవీతో ఆమె చర్చించిన ఆరోగ్య రహస్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఎపిసోడ్‌లో సమంత ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే విషతత్వాల గురించి చర్చించారు. డాక్టర్



లేవీ తన 'Toxins, The Cause of All Diseases' అనే పుస్తకంలోని ముఖ్యమైన విషయాలను వివరిస్తూ, మన రోజువారీ జీవనశైలిలో ఉండే విషతత్వాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వివరించారు. ఆయన చెప్పిన మేరకు, ఆక్సిడేటివ్ స్ట్రెస్ అనేది అనేక వ్యాధులకు మూల కారణం అవుతోంది. గుండె సంబంధిత వ్యాధుల నుంచి క్యాన్సర్ వరకు అనేక ఆరోగ్య సమస్యలకు ఈ విషతత్వాలు ప్రధాన కారణమని వెల్లడించారు. సమంత ఈ కార్యక్రమం ద్వారా తన అనుభవాలను పంచుకున్నారు. కొంత కాలంగా మయోసిటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడుతున్న ఆమె, సహజ చికిత్సా విధానాలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వైద్యుల సూచనల మేరకు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, రోజువారీ విషతత్వాలను తొలగించుకునే పద్ధతులు పాటించడం వంటి విషయాల గురించి వివరించారు. ముఖ్యంగా, డాక్టర్ లేవీ చెప్పినట్టు విటమిన్ %జ% ఆరోగ్యాన్ని కాపాడటంలో అద్భుతంగా పనిచేస్తుందని, తన అనుభవంలో కూడా ఇది చాలా ఉపయోగపడిందని పేర్కొన్నారు. సమంతా సినిమాల్లో ఎంత జాగ్రత్తలు తీసుకుంటారో, ఆరోగ్య పరంగా కూడా అంతే శ్రద్ధ చూపిస్తున్నారు. ఆరోగ్యంపై ఆమె పెంచుకున్న అవగాహన ఇప్పుడు మరింత ప్రాముఖ్యత పొందుతోంది. ఇలాంటి ప్రముఖుల ఆరోగ్య కార్యక్రమాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిమానులు భావిస్తున్నారు.




## మూడో భాగం అంత ఈజీ కాదు సుమా..?



ఒక సినిమాగా చెప్పాల్సిన కథను రెండు భాగాలు చేసి చెప్పడమే ఒక పెద్ద టాస్క్ అనిపించగా ఇప్పుడు కథను ఇంకాస్త కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారు మన మేకర్స్. బాహుబలి తో రాజమౌళి చేసిన ఈ ప్రయోగం బ్లాక్ బస్టర్ అవ్వడంతో ఆ తర్వాత చాలామంది అదే పంథా కొనసాగిస్తున్నారు.

బాహుబలి 1,2 తర్వాత కె.జి.ఎఫ్ 1,2 వచ్చింది. ఆ తర్వాత పుష్ప 1, 2 వచ్చింది. ఇవన్నీ పాన్ ఇండియా హిట్ సినిమాలు కాగా డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ ఇంకా మ్యాడ్ 1, మ్యాడ్ స్క్వేర్ లు టాలీవుడ్ లో హిట్ అందుకున్నాయి. ఐతే రాజమౌళి కూడా బాహుబలి సినిమాను రెండు భాగాలతో ముగించాడు. ఐతే పుష్ప కథను మాత్రం సుకుమార్ ముగించలేదు. అందుకే పుష్ప 3 పోస్టర్ వేశాడు. ఐతే ఒక కథను ఇలా కొనసాగించడం మాత్రం పుష్ప వల్లే అయ్యింది. పార్ట్ 3 కచ్చితంగా డబుల్ క్రేజ్ తో ఒక రేంజ్ బజ్ తో వస్తుంది. ఐతే పుష్ప 3 సినిమా చేయడం అన్నది అంత ఈజీ విషయం కాదు. పుష్ప 2 క్లైమాక్స్ లో తన ఫ్యామిలీతో పుష్ప రాజ్ కలిశాడు కానీ ఏకంగా సెంట్రల్ మినిస్టర్ తోనే కయ్యాన్ని పెట్టుకున్నాడు. ఆ కథతోనే పుష్ప 3 రాబోతుంది. ఇక టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ కాగా టిల్ల్య క్యూబ్ కూడా ఉండే ఛాన్స్ ఉంది. ఐతే టిల్లు క్యూబ్ కథ ఎలా ఉంటుంది అన్నది ఆడియన్స్ లో ఇంట్రెస్టింగ్ గా ఉంది. రీసెంట్ గా రిలీజై సక్సెస్ అందుకున్న మ్యాడ్ స్క్వేర్ కి కూడా మ్యాడ్ క్యూబ్ ఉంటుందని తెలుస్తుంది. టిల్లు, మ్యాడ్ జస్ట్ టైటిల్ ని కొనసాగిస్తూ అదే కాస్టింగ్ తో కొనసాగిస్తున్నారు. కథలను మార్చి సీక్వెల్ గా చేస్తూ సక్సెస్ అందుకుంటున్నారు. ఐతే మూడో భాగం అంటే ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేయడం వరకు ఓకే కానీ అదే రేంజ్ కథ కూడా ఉండాలి.

కచ్చితంగా టైటిల్ సీక్వెల్స్ ని చేస్తున్నా ఇంట్రెస్టింగ్ స్టోరీ స్క్రీన్ ప్లే ఉంటేనే ఆడియన్స్ కి ఆసక్తికరంగా ఉండే ఛాన్స్ ఉంటుంది. మరి ఈ మూడో భాగం సినిమాల విషయంలో మేకర్స్ లెక్క ఎలా ఉందో చూడాలి. ఇక సీక్వెల్స్ విషయానికి వస్తే దేవర 1, సలార్ 1 ల తర్వాత రాబోయే రెండేళ్లలో దేవర 2, సలార్ 2 లు రాబోతున్నాయి. ఈ సీక్వెల్స్ మీద కూడా భారీ అంచనాలు ఉన్నాయి.

## 'తెలుసు కదా'.. సిద్ధుకు పెద్ద సవాలే!




టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. టిల్లు సిరీస్ చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. బ్లాక్ బస్టర్ హిట్స్ ను సొంతం చేసుకున్నారు. కెరీర్ లో బెస్ట్ స్టేజ్ కు చేరుకున్నారు. దీంతో అందరి ఫోకస్ ఆయన అప్ కమింగ్ చిత్రాలపై పడింది. అదే సమయంలో రీసెంట్ గా జాక్ సినిమాతో వచ్చారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఆ సినిమా నిరాశపరిచింది. టిల్లు క్యారెక్టర్ కు తాను తప్ప ఎవరూ సెట్ కారు అన్నంతలా అలరించిన సిద్ధు.. జాక్ లోని ఏజెంట్ పాత్రలో ఇమడలేకపోయారు. టిల్లు మార్కే మళ్లీ కనపడడంతో అంతా నిరాశ చెందారు.

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయినట్లు ప్రేక్షకులను మాత్రం సినిమా అస్సలు మెప్పించలేదు. అదే సమయంలో జాక్ ప్రమోషన్స్ లో మిగతా హీరోల్లా సందడి చేయలేదు. ఇంటర్వ్యూలు ఇచ్చినప్పటికీ.. అనుకున్నంత స్థాయిలో ప్రమోట్ చేయలేదని అంతా అంటున్నారు. అయితే మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కాదని ముందే భావించారని, కానీ ఇంత ఫ్లాప్ అవుతుందని ఊహించి ఉండరని చెబుతున్నారు. ఏదేమైనా సిద్ధుకు జాక్ తో షాక్ తగిలింది. అయితే జాక్ మంచి పాఠాన్ని సిద్ధుకు నేర్పించిందనే చెప్పాలి. ఇప్పుడు తన కొత్త చిత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెటిజన్లు సూచిస్తున్నారు. ఆయన లైనప్ లో నెక్స్ట్ రిలీజ్ కు రెడీ అవుతున్న చిత్రం తెలుసు కదా. రొమాంటిక్ కామెడీ జోనర్ లో రూపొందుతున్న ఆ మూవీని నీరజ కోన తెరకెక్కిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఆ సినిమాలో శ్రీనిధి శెట్టి, రాశీఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా మూవీ షూటింగ్ జరుగుతుండగా.. రీసెంట్ గా సిద్ధు బర్త్ డే స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ట్రయాంగిల్ లవ్ స్టోరీ సినిమా అని మేకర్స్ తెలిపారు. సిద్ధు రోల్ కొత్తగా ఉంటుందని అన్నారు. టిల్లు స్క్వేర్ తర్వాత జాక్ తో ఫ్లాప్ అందుకున్న స్టార్ బాయ్.. ఇప్పుడు తెలుసు కదా మూవీతో కమ్ బ్యాక్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే మార్కెట్ దెబ్బతింటుంది. అదే సమయంలో టిల్లు వల్ల కొత్త పాత్రలు పండించడం సిద్ధుకు కష్టంగా ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో తెలుసు కదాతో ఆయనకు పెద్ద సవాలే ఎదురవ్వనుంది. మరి ఎలా మెప్పిస్తారో.. ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

## జిమ్ లో తెలుగమ్మాయి వర్కౌట్స్.. క్యూట్ సెల్ఫీలు చూశారా?

సినీ ఇండస్ట్రీలో ఇప్పుడు అనేక మంది తెలుగమ్మాయిలు తమ టాలెంట్ తో రానిస్తున్నారు. మంచి ఛాన్సులు అందుకుని అదరగొడుతున్నారు. అలాంటి వారిలో శాన్వీ మేఘన కూడా ఒకరు. హైదరాబాద్ బ్యూటీ అయిన ఆమె.. తక్కువ సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకుందనే చెప్పాలి. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది అమ్మడు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే శాన్వీ.. తాజాగా క్యూట్ సెల్ఫీలను పోస్ట్ చేసింది. హైదరాబాద్ లోని ఓ ఫిట్ నెస్ స్టూడియోలో దిగిన పిక్స్ షేర్ చేసిన అమ్మడు.. తన వర్కౌట్స్ రిజల్ట్ ను చూపించేసింది! బ్లాక్ టాప్, కలర్ ఫుల్ షార్ట్ వేసుకున్న బ్యూటీ.. తన కర్లీ హెయిర్ తో బ్యూటిఫుల్ గా ఉందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఇన్స్పిరేషన్ కాదు.. డిసిప్లైన్ గురించి ఆలోచించండంటూ ఇచ్చి క్యాప్షన్ బట్టి ఆమె డెడికేషన్ ఎలా ఉందో క్లియర్ గా చెప్పవచ్చు. మొత్తానికి శాన్వీ పోస్ట్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కొన్ని నిమిషాల్లో వేలల్లో లైక్స్ అండ్ కామెంట్స్ వచ్చాయి. సో క్యూట్ మేడమ్ అని నెటిజన్లు చెబుతున్నారు. సూపరో సూపర్ అని అంటున్నారు. ఇక ఆమె కెరీర్



విషయానికొస్తే.. హైదరాబాద్ లోనే పుట్టి పెరిగిన శాన్వీ మేఘన.. మెగాస్టార్ చిరంజీవి సైరా నరసింహారెడ్డి మూవీతో తన సినీ జర్నీని స్టార్ట్ చేసింది. 2019లో ఆ సినిమా రిలీజైంది. ఆ తర్వాత నెట్ ఫ్లిక్స్ తెలుగు ఒరిజినల్ పిట్ట కథలు (2021)తో మంచి గుర్తింపు సంపాదించుకుందనే చెప్పాలి. అనంతరం వివిధ ప్రాజెక్టుల్లో ఛాన్సులు వచ్చాయి. బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్, పుష్పక విమానం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది అమ్మడు. కోలీవుడ్ లో కుటుంబస్థాన్ మూవీ చేసి మంచి సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత రీసెంట్ గా తెలుగులో టుక్ టుక్ మూవీతో సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇండస్ట్రీలో భారీ ఆఫర్స్ అందుకునేందుకు ట్రై చేస్తోంది శాన్వీ మేఘన. తన టాలెంట్ తో ఓ రేంజ్ లో మెప్పించాలని ఉవ్విళ్లూరుతోంది. తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తోంది అమ్మడు. మరి శాన్వీకి ఫ్యూచర్ లో ఎలాంటి ఛాన్సులు వస్తాయో.. ఎలాంటి విజయాలు అందుకుంటుందో అంతా వేచి చూడాలి.

## బలగం బ్యూటీ వెయిటింగ్ ఫర్ ఏ ఛాన్స్..!

చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి హీరోయిన్ గా మారిన భామల్లో తెలుగు అమ్మాయి కావ్య కళ్యాణ్ రామ్ ఒకరు. చైల్డ్ ఆర్టిస్ట్ గా నటిస్తూ ఆడియన్స్ కు దగ్గరైన ఈ అమ్మడు మసూద సినిమాతో హీరోయిన్ గా టర్న్ తీసుకుంది. ఆ తర్వాత బలగం సినిమాతో ఆకట్టుకుంది. ప్రియదర్శికి జతగా బలగం సినిమాలో కావ్య నటనకు ఆడియన్స్ ఇంప్రెస్ అయ్యారు. బలగం తో పాపులారిటీ బాగా వచ్చినా అవి ఛాన్స్ ల రూపంలో మాత్రం మారాలేదు. బలగం తర్వాత అమ్మడు శ్రీ సింహాతో ఉస్తాద్ అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా వర్క్ అవుట్ కాకపోయే సరికి కావ్యని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే కావ్య మాత్రం సినిమా ఆఫర్లు లేకపోయినా ఆడియన్స్ ను తన ఫోటో షూట్స్ తో బుట్టలో వేసుకోవాలని చూస్తుంది. తనదైన శైలిలో రకరకాల ఫోటో షూట్స్ తో అలరిస్తుంది కావ్య కళ్యాణ్ రాం. కెరీర్ బిజీ చేసుకునే ప్లానింగ్ లో భాగంగానే అమ్మడు ఫోటో షూట్స్ తో ఎట్రాక్ట్ చేస్తుంది.



ముఖ్యంగా తన క్యూట్ లుక్స్ తో కావ్య ఫాలోవర్స్ హృదయాలను మెలిపెట్టేలా చేస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్ గానే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అమ్మడు ఇప్పుడు హీరోయిన్ గా కూడా అదే ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఐతే బలగం హిట్ తో కచ్చితంగా కావ్య కెరీర్ ఊపందుకుంటుందని అనుకోగా ఎందుకో అలా జరగలేదు. ఐతే కావ్య కూడా హడావిడిగా సినిమాలు చేసే ఉద్దేశం లేనట్టు ఉంది. అందుకే కెరీర్ గురించి పెద్దగా దిగులు పడకుండా వచ్చిన ఛాన్స్ లనే చేస్తూ వస్తుంది. ఐతే కొందరు తెలుగు అమ్మాయి కాబట్టే కావ్యకి అవకాశాలు ఇవ్వట్లేదు అన్నట్టుగా మాట్లాడుతున్నా వాటిని అసలేమాత్రం లెక్క చేయకుండా తన కోసం రాసి పెట్టుకున్న పాత్రలు వస్తాయని ఎదురుచూస్తుంది అమ్మడు. ఈమధ్య సినిమాల్లో కాస్టింగ్ విషయంలో డైరెక్టర్స్ చాలా పర్ఫెక్ట్ గా ఉంటుంది. కావ్య లాంటి భామ కావాలి ఆమె మాత్రమే చేస్తుంది అని ఫిక్స్ అయితే వెంటనే పిక్ చేసుకుంటున్నారు. ఐతే కావ్య కూడా అలాంటి ఛాన్స్ ల కోసమే ఎదురుచూస్తున్నట్టుగా ఉందని తెలుస్తుంది. కావ్య సినిమాలు చేసినా చేయకపోయినా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తోనే ఆడియన్స్ లో మంచి క్రేజ్ సంపాదిస్తుంది. ఇక వాటికి తోడు మంచి సినిమాలు కూడా పడితే తిరుగు ఉండదని చెప్పొచ్చు.




## దిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా?: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. “టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్‌ఫ్రంట్‌ను పరిశీలించాం. మూసీ నది ప్రక్షాళనకు కొంత మంది అడ్డుపడుతున్నారు. దిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం.

తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటుతో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు” అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.




**హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ పరీక్షా ఫలితాలు ఈ నెల 22న విడుదల కానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నారు. గత నెల 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఫలితాలను www.eenadu.netలో తెలుసుకోవచ్చు**

## బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదు: కేటీఆర్





హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు భారాస దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ భారాస నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదని చెప్పారు. ఎన్నికకు హాజరు కావద్దని పార్టీ తరఫున విప్ కూడా జారీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి కాంగ్రెస్, భారాస దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. “కాంగ్రెస్, తెదేపా, భాజపాను ఎదుర్కొని కేసీఆర్ పార్టీ పెట్టారు. కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ వచ్చింది. ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా భారాస సమర్థంగా పోషిస్తుంది. చేసినవి చెప్పుకోనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. 17 నెలల్లో భారాస గ్రాఫ్ బాగా పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ భూముల పేరుతో అరాచకాలు చేస్తోంది. రాష్ట్ర భాజపా ఎంపీలు కాంగ్రెస్‌ను ఒక్క మాట కూడా అనరు. 17 నెలల్లో తెలంగాణకు భాజపా ఒక్క పైసా పని చేయలేదు. హెచ్‌సీయూ భూములపై మోదీ ఎందుకు విచారణ జరిపించట్లేదు? తెలంగాణ కాంగ్రెస్, భాజపా ఒక్కటే. మతం పేరిట రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఆమోదించరు” అని కేటీఆర్ తెలిపారు.

## భాజపాతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: కేసుల నుంచి తప్పించుకునేందుకే భాజపాతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అక్రమాలపై చర్యలు తీసుకోకూడదనే ఉద్దేశంతోనే మోదీకి కేటీఆర్ దాసోహమయ్యారని ఆరోపించారు. భారాస బలహీనత వల్లే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, పదేళ్లపాటు మోదీ తీసుకున్న నిర్ణయాలన్నింటికీ ఆ పార్టీ మద్దతిచ్చిందని అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారాస నాయకురాలు కవితను మద్యం స్కామ్ నుంచి కాపాడుకోవడానికి భాజపాకి ఊడిగం చేశారని దుయ్యబట్టారు. భాజపాకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపాని గెలిపించాలని ఆయన తాపత్రయ పడుతున్నారని విమర్శించారు.




**జనగామ జిల్లా రఘునాథపల్లి మండల పరిధిలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన లారీ అదుపుతప్పి టోల్‌గేట్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టోల్‌గేట్ క్యాబిన్ ధ్వంసం కాగా.. ఒప్పంద ఉద్యోగి గాయపడ్డాడు. మరో కారు ధ్వంసం అయింది. మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.**




జేఈఈ (మెయిన్) సెషన్-2 ఫలితాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (%చీూ%) పర్సంటైల్ స్కోరును వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 110 మంది జేఈఈ అభ్యర్థుల ఫలితాలు నిలిపివేసింది. వారు అక్రమాలకు పాల్పడ్డారని, ఫోర్జరీ పత్రాలు ఉపయోగించినట్లు గుర్తించామని ఎన్టీఏ అధికారులు తెలిపారు. కాగా.. జనరల్ విభాగంలో 93.102, ఈడబ్ల్యూఎస్- 80.383, ఓబీసీ-79.431, ఎస్సీ-61.15, ఎస్టీ-47.90 పర్సంటైల్ స్కోర్‌ను కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ స్కోర్‌కు సమానం, అంతకంటే ఎక్కువ స్కోర్ పొందినవారు మాత్రమే మే 18వ తేదీన జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారు. రెండు విడతల్లో కలిపి మొత్తం 24 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఇదిలాఉంటే.. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ -1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలివిడుదల చేసినప్పటికీ.. కొన్ని గంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్‌టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ‘ఎక్స్’ వేదికగా ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2 గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురు చూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తంచేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే.




దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) సెషన్ -2 ఫలితాలు వచ్చేశాయి. శుక్రవారం మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో పేపర్ -1 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. స్కోర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్‌లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. బనిబ్రత మాజీ, వంగల అజయ్‌రెడ్డి 300కి 300 మార్కులు పొందటంతో ఇద్దరికీ ఒకే ర్యాంకు కేటాయించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మరో ఇద్దరికి కూడా ఒకటో ర్యాంకు దక్కే అవకాశం ఉందని సమాచారం. ఈసారి వయసు కొలమానం తొలగించడంతో సమానమైన మార్కులు వచ్చిన వారికి ఒకటే ర్యాంకు కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ విభాగంలో కూడా అజయ్‌రెడ్డి ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు. అజయ్‌రెడ్డి సొంతూరు ఏపీలోని నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలంలోని తాటిపాడు. 9వ తరగతి నుంచి హైదరాబాద్‌లోనే చదువుతున్నారు. ఈసారి జనరల్ విభాగంలో కటాఫ్ ర్యాంకు 93.102 పర్సంటైల్‌గా నిర్ణయించారు. గత ఏడాది అది 93.236గా ఉంది.మొత్తం 14.75 లక్షల మంది పరీక్షలు రాశారు. జనరల్ విభాగంలో 93.102, ఈడబ్ల్యూఎస్- 80.383, ఓబీసీ-79.431, ఎస్సీ-61.15, ఎస్టీ-47.90 పర్సంటైల్ స్కోర్‌ను కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ స్కోర్‌కు సమానం, అంతకంటే ఎక్కువ స్కోర్ పొందినవారు మాత్రమే మే 18వ తేదీన నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారు. రెండు విడతల్లో కలిపి మొత్తం 24 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. తెలంగాణ నుంచి బనిబ్రత మాజీ, హర్ష్ ఎ.గుప్తా, అజయ్‌రెడ్డి ఉండగా...ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ ఉన్నారు. జేఈఈ (మెయిన్) సెషన్ 1, 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం మే 18న జరిగే జేఈఈ (అడ్వాన్స్‌డ్) పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు.




## 2 వేల మంది రీపోస్టు చేశారు.. వారిపై చర్యలు తీసుకుంటున్నారా?: స్మితా సభర్వాల్

హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో ఆమెకు ఈనెల 12న నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. పోలీసులకు పూర్తిగా సహకరించినట్లు తెలిపారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తాను రీపోస్టు చేసినట్లే రెండు వేల మంది చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని స్మితా సభర్వాల్ అడిగారు. కంచ గచ్చిబౌలిలో వన్యప్రాణుల పరిస్థితి ఇదంటూ వైరల్ అయిన నకిలీ ఫొటోలను ఆమె సోషల్‌మీడియాలో షేర్ చేసిన నేపథ్యంలో పోలీసులు నోటీసులు ఇచ్చారు.

## వాహనాల పైకి దూసుకెళ్లి.. నటుడు బాబీ సింహా కారు బీభత్సం



చెన్నై: నటుడు బాబీ సింహా కారు శనివారం ఉదయం బీభత్సం సృష్టించింది. ఎక్కడుతంగల్ - చెన్నై ఎయిర్‌పోర్ట్ రోడ్డులో వాహనాల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో సుమారు ఆరు వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం తాగి వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో బాబీ సింహా కారులో లేరని వారు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.




హైదరాబాద్ లో దాదాపు ఇంటికో కారు, రెండు మూడు బైక్ లు ఉన్నోళ్లు చాలామందే ఉన్నారు. బైక్ అయినా కార్ అయినా ఎక్కువ కాలం నడవాలంటే ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించటం తప్పనిసరి. ప్రాబ్లమ్ ఏదీ లేకపోయినా ఇంజిన్ ఆయిల్ మాత్రం ఎప్పటికప్పుడు చేంజ్ చేస్తూనే ఉండాలన్నది అందరికి తెలిసిన విషయమే...

అయితే, అదే ఇంజిన్ ఆయిల్ నకిలీ అయితే.. మన కార్, బైక్ పరిస్థితి ఏంటి.. అవును హైదరాబాద్ లో బయటపడ్డ ఈ నకిలీ ఇంజిన్ ఆయిల్ బాగోతం గురించి తెలిస్తే.. బయట షాపుల్లో ఇంజిన్ ఆయిల్ కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. శనివారం ( ఏప్రిల్ 19 ) నకిలీ ఇంజిన్ ఆయిల్ దందా గుట్టురట్టు చేశారు టాస్క్ ఫోర్స్ పోలీసులు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. క్యాస్ట్రోల్ ఇంజిన్ ఆయిల్ పేరుతో నకిలీ ఇంజిన్ ఆయిల్ తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు పోలీసులు. నూర్ ఖాన్ అనే వ్యక్తి నకిలీ ఇంజిన్ ఆయిల్ తయారు చేసి.. క్యాస్ట్రోల్ ఇంజిన్ ఆయిల్ లేబుల్స్ అంటించి అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు పోలీసులు. పక్క సమాచారంతో దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రూ. 3 లక్షల రూపాయల విలువచేసే 710 లీటర్ల నకిలీ ఆయిల్ సీజ్ చేసినట్లు తెలిపారు.

మరి.. ఇంజిన్ ఆయిల్ చేంజ్ చేసేందుకు ఆథరైజ్డ్ డీలర్ దగ్గరికి వెళ్ళడానికి బద్దకించి.. దగ్గర్లోని షాపులో ఇంజిన్ ఆయిల్ చేంజ్ చేసేటోళ్లు ఇకనైనా జాగ్రత్త పడండి.. ఎందుకైనా మంచిది మీ వెహికల్ కి వాడిన ఇంజిన్ ఆయిల్ నకిలీదో, ఒరిజినలో ఒకసారి చెక్ చేసుకోండి.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com